
manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక MANAVISHWAM TELUGU DAILY




వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 27 | మంగళవారం, జూలై 14 2026 | పేజీలు - 8 | వెల : 5/-

## ధాన్యం రవాణాలో 'కోట్ల'
# కుంభకోణం




- లారీలు పెట్టలేదు.. ధాన్యం తరలించలేదు.. కానీ బిల్లులు మాత్రం క్లియర్!
- ప్రభుత్వానికి, రైతులకు కాంట్రాక్టర్ల భారీ మోసం
- పౌరసరఫరాల శాఖ అధికారుల అండదండలతోనే అక్రమార్జన?
- హన్మకొండ జిల్లాలో వెలుగుచూసిన రవాణా మాఫియా గుట్టు!

**హన్మకొండ ,జులై 13( మన విశ్వం) :** రైతు చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు చేర్చే ప్రక్రియలో కొన్నేళ్లుగా పౌరసరఫరాల శాఖ అధికారుల స హకా రంతో భారీ అవి నీతి చోటుచేసు కు ంటు న్నట్లు తెలుస్తోంది. లారీలు పెట్టకుండా, అస లు ధాన్యాన్ని రవాణా చేయకుండానే రికార్డుల్లో మాత్రం లారీలు నడిచినట్లు చూపిస్తూ కాంట్రాక్టర్ కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టారనే ఆరోపణలు ఉన్నాయి . అధికారుల అండదండలతోనే గత మూడేళ్లుగా ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నట్లు సమాచారం.

**రికార్డుల్లో మాత్రమే లారీలు.. క్షేత్రస్థాయిలో రైతుల ట్రాక్టర్లే శరణ్యం!**

హన్మకొండ జిల్లావ్యాప్తంగా ప్రతి సీజన్‌లోనూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు పౌరసరఫరాల శాఖ టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్లకు రవాణా బాధ్యతలు అప్పగిస్తారు. అయితే, జిల్లావ్యాప్తంగా సుమారు 60శాతం

మిగతా 2లో...

## తెలంగాణకు సుప్రీంకోర్టులో
# ఎదురుదెబ్బ

- పోలవరం పిటిషన్‌లో సాంకేతిక లోపాలు గుర్తించిన సుప్రీంకోర్టు
- ఏపీకి నోటీసులు, మధ్యంతర స్టే ఇవ్వడానికి నిరాకరణ
- లోపాలు సరిదిద్దిన తర్వాతే తదుపరి విచారణ



**న్యూఢిల్లీ, జూలై 13 (మన విశ్వం):** పోలవరం ప్రాజెక్టు, గోదావరి జలాల వినియోగం, బనకచర్ల అనుసంధానం, కృష్ణా జలాల అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు సుప్రీంకోర్టులో ప్రారంభ దశలోనే ఎదురుదెబ్బ తగిలింది. పిటిషన్‌లో సాంకేతిక లోపాలు ఉన్నాయని గుర్తించిన సుప్రీంకోర్టు, వాటిని సరిదిద్దిన తర్వాతే తదుపరి విచారణ చేపడతామని స్పష్టం చేసింది. ఈ దశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం లేదా మధ్యంతర స్టే ఇవ్వడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది.
జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై వెంటనే నోటీసులు జారీ చేసి, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అయితే పిటిషన్‌లో ప్రాథమిక సాంకేతిక లోపాలు ఉన్నాయని ధర్మాసనం అభిప్రాయపడి ంది. ఈ కేసులో మొత్తం

మిగతా 2లో...

## ముఖ్యమంత్రితో జాతీయ ఎస్సీ
# కమిషన్ ఛైర్మన్ భేటీ

- వివక్షకు తావులేకుండా 'ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'
- కేంద్రం నుంచి సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్, జులై 13(మన విశ్వం):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్‌పర్సన్ కిషోర్ మక్వానా మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ ప్రతినిధి బృందంతో కలిసి సోమవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రితో వారు భేటీ అయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యా రంగంలో తాము చేపట్టిన సంస్కరణలను జాతీయ ఎస్సీ కమిషన్ ప్రతినిధులకు

మిగతా 2లో...

## చిన్నారులకు
# 'ఆరోగ్య కవచం'

- రాష్ట్రవ్యాప్తంగా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ షురూ
- లక్ష్యం 96.81 లక్షల మంది.. 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఉచితంగా అందజేత
- ఈ నెల 20న ప్రత్యేక మాప్-అప్ డ్రైవ్
- తల్లిదండ్రులు సహకరించాలి: వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, జూలై 13 (మన విశ్వం):** రాష్ట్రంలోని చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక అడుగు వేసింది. జాతీయ నులిపు రుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ సోమవారం ప్రారం భమైంది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విద్యా ర్థులకు స్వయంగా మాత్రలు వేసి ఈ బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ.. రాష్ట్రంలో 1నుంచి 19 ఏళ్ళ వయసు గల 96,81, 855మంది చిన్నారులు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయడమే లక్ష్యంగా

మిగతా 2లో...

## 'మా రక్తం తీసుకో..
# రైతులకు నీళ్లివ్వు'

- రక్తదానంతో బీఆర్ఎస్ వినూత్న నిరసన
- క్యాంపు కార్యాలయానికి వెళ్తుండగా విద్యార్థి నేతల అరెస్టు
- తెలంగాణ భవన్‌లో ఉద్రిక్తత




**హైదరాబాద్, జూలై 13 (మన విశ్వం):** కాళేశ్వరం ప్రాజెక్టు, రైతులకు సాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో వినూత్న నిరసన చేపట్టారు. "రక్తదాహం తీర్చేందుకు రక్తదానం" పేరిట నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి పార్టీ కార్యకర్తలు, విద్యార్థి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం

మిగతా 2లో...

## అంతర్జాతీయ వేదికపై తెలంగాణ
# 'బంగారు' తల్లి!

- ఆసియా అండర్ -23 అథ్లెటిక్స్ రిలేలో ప్రవల్లిక బృందానికి స్వర్ణం
- తాపీ మేస్త్రీ కూతురి అద్భుత ఘనత. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు




**హైదరాబాద్,జులై, 13(స్పోర్ట్స్ డెస్క్):** అంతర్జాతీయ క్రీడా వేదికపై తెలంగాణ కీర్తి పతాకం ఎగిరింది. చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన ప్రతిష్టాత్మక తొలి 'ఏషియా అండర్-23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్ 2026'లో తెలంగాణకు చెందిన ప్రవల్లిక నరిమళ్ల సరికొత్త చరిత్ర సృష్టించారు. మహిళల 4 ఐ 400 మీటర్ల రిలే పరుగుపందెంలో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన ఆమె అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని ముద్దాడారు. ఈ అద్భుత విజయ

మిగతా 2లో...

## సీఎం రేవంత్‌పై
# కేసు పెట్టాలి

- శాంతిభద్రతలు కుప్పకూలాయి.. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలూ ఘోరం!
- 'కోస్తా, రక్తం చల్లుతా' అని హింసను ప్రేరేపిస్తారా? లైవ్ ఆధారాలున్నా డీజీపీ ఎందుకు స్పందించరు?
- నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి ధ్వజం.. త్వరలోనే బసవేశ్వర ప్రాజెక్టు కోసం భారీ పాదయాత్ర!



**సంగారెడ్డి, జూలై 13 (మన విశ్వం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని, శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా క్షీణించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి. హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం నారాయణఖేడ్ నియోజకవర్గ బీఆర్ఎస్

మిగతా 2లో...

## దేవాదులకు వేగం..
# రైతులకు భరోసా!

- పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- నిధుల కొరతకు తావులేదు 22 రిజర్వాయర్లను నింపడమే లక్ష్యం
- గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించి దేవాదుల ఆయకట్టుకు శాశ్వత సాగునీరు



**ములుగు, జూలై 13 (మన విశ్వం):** దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర రైతాంగానికి జీవనాడిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

మిగతా 2లో...

# సంపాదకీయం



## గ్రామాల అభివృద్ధి పట్టని పాలకులు !

పల్లె కన్నీరు పెడుతోంది. మంచినీటి కోసం కన్నీరు పెడుతోంది. సాగునీటి కోసం రైతన్న కన్నీరు పెడుతున్నాడు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరించామన్న పెద్దమనుషులు గ్రామాలకు వస్తే..చెరువులు ఎలా ఉన్నయో కనిపిస్తాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్ధరణ జరగలేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కకూడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టి పోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళ్లుగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు. గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. అమరావతి పేరుతో ఎపిలో గ్రామాలను పట్టించు కోవడం లేదు. బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పంటలు వేసుకున్న పొలాలను జెసిబిలతో దున్నుతూ రైతులను వీధుల్లో పడేస్తున్నారు. వారికి గౌరవప్రదమైన పరిహారం కూడా చెల్లించడం లేదు. చంద్రబాబు నిరంకుశ విధానాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. తెలంగాణో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుద్ధరణ వంటి వాటికి ఇస్తున్న ప్రాధాన్యం గ్రామాలకు దక్కడం లేదు. దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. మొక్కలు నాటడం లేదు. కోతులను తరమడం లేదు. భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేని వేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా కూడా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు బాధ్యులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ది చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రోడ్డురవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతట అవే పురోగమిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... తప్పు లేదు. అందుకు తగ్గట్లుగా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలిగితేనే ఇది సాధ్యం అవుతుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడగలదు.చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఓవైపు రాష్ట్రమంతటా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అప్పుడప్పుడు మబ్బులే తప్ప వానలు పడటం లేదు. ఒక్కోరోజు వాతావరణం ఎండాకాలాన్ని తలపి స్తున్నది. పంటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్న పరిస్థితి కనపడుతోంది. గతేడాది కంటే ప్రస్తుతం రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. దేశంలో పంటల సాగుపై ఎల్ నినో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ఎల్ నినో తీవ్ర రూపం దాల్చడంతో వానలు కరువయ్యాయి. మబ్బులే తప్ప చినుకు జాడలేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 21శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలుపడలేదు. జూలై సగం నెల గడుస్తున్నా వానలు ముఖం చాటేసాయి. ఈ నెలలోనూ వర్షాలు కురువకపోవచ్చనే అంచనాలను వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు వేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఒకవేళ ముందుగానే పంటలు వేస్తే తర్వాత వర్షాలు కురువకపోతే పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంటుందని రైతులు భయపడుతున్నారు. దీంతో పంటలు సాగు చేసేందుకు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదంతా కూడా గ్రామాల్లో వాననీటిని ఒడిసి పట్టకపోవడం వల్ల జరిగిన నష్టంగా గుర్తించాలి. ఇప్పటికైనా గ్రామాల్లో తాగు, సాగునీటి ప్రాజెక్టును పునరుద్ధరించడం ద్వారా అభివృద్ధికి అడుగులు వేయాలి.

## ధాన్యం రవాణాలో 'కోట్ల'

మంది రైతులు ప్రతీ సీజన్ లో తమ సొంత వాహనాల్లోనే ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది.జిల్లాలో ప్రధానంగా కమలాపూర్ సెక్టార్ లో గత 3 సంవత్సరాలనుండి ప్రతి సీజన్‌లోనూ అసలు లారీల అవసరమే లేకుండానే 80శాతం మంది రైతులు తమ సొంత ట్రాక్టర్లలో ధాన్యాన్ని మిల్లులకు చేర్చారు. లారీల్లో కాకుండా రైతులే సొంత వాహనాల్లో ధాన్యం తీసుకొస్తే, పౌరసరఫరాల శాఖ కార్యాలయంలోని 'ఓపిఎంఎస్ 'వివరాల్లో ఏమని నమోదు చేశారనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. లారీలు రాకపోయినా, రవాణా జరగకపోయినా అధికారులు ఏటా ఒక్కో సీజన్‌కు రూ లక్షల రూపాయల ప్రభుత్వ సొమ్మును సదరు కాంట్రాక్టర్ ఖాతాలోకి ఎలా మళ్లించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రవాణా ఛార్జీల్లోనూ భారీ కోత.. రైతులకు అన్యాయం

కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని లారీల్లో తరలించడానికి కాంట్రాక్టర్ కు ప్రభుత్వం క్వింటాలుకు సుమారుగా రూ. 32రూపాయల వరకు చెల్లిస్తోంది. కానీ, లారీలు పెట్టని కమలాపూర్ సెక్టార్ కాంట్రాక్టర్.. సొంతంగా తమ ట్రాక్టర్ లలో ధాన్యం తరలించిన రైతులు రవాణా ఛార్జీల గురించి అడగగా రైతులకు ఏదో తమ జేబుల్లోంచి ఇస్తున్నట్లు బిల్డప్ ఇస్తూ క్వింటాలుకు గరిష్టంగా రూ. 15 రూపాయలు మాత్రమే చెల్లించిన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.?తాము లారీలు పెట్టకపోయినా, రవాణా చేయకపోయినా.. ప్రభుత్వం ఇచ్చే పూర్తి స్థాయి బిల్లులను మాత్రం అధికారుల సహకారంతో కాంట్రాక్టర్లు 3సంవత్సరాలనుండి స్వాహా చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

అధికారుల 'సహకారం' వెనుక మర్మమేంటి?

హన్మకొండ జిల్లాలోని కమలాపూర్ సెక్టార్ లో ?ధాన్యం రవాణా కాంట్రాక్టర్ లారీల్లో ధాన్యం తరలించడం లేదనే విషయం క్షేత్రస్థాయి అధికారుల నుండి ఉన్నతాధికారుల వరకు అందరికీ స్పష్టంగా తెలిసినప్పటికీ.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేంటో పౌరసరఫరాల శాఖ అధికారులే సమాధానం చెప్పాలి. కళ్లు మూసుకుని మరీ బిల్లులు ఎలా క్లియర్ చేశారో, ఈ అవినీతి భాగస్వామ్యంలో ఎవరెవరికి ఎంత వాటా అందిందో విచారణ జరిపితేనే వాస్తవాలు బయటికొస్తాయని, ఇప్పటికైనా విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రితో జాతీయ ఎస్సీ



ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు. ప్రధానంగా విద్యార్థుల మధ్య కుల వివక్షను పూర్తిగా దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. అందుకోసం ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిష్టాత్మకంగా'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచే వీటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

తెలంగాణ పబ్లిక్ స్కూల్స్.. ఎస్సీ వర్గీకరణ

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌తో పాటు రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నామని, మొదటగా కోర్ అర్బన్ రీజియన్‌లో వీటిని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నామని, రాజకీయ, ఇతర రంగాల్లో కీలక స్థానాలు ఇచ్చామన్నారు. అలాగే ఎస్సీ ఉప కులాల వర్గీకరణను పూర్తి చేసి అమలు చేస్తున్నామని కమిషన్‌కు వివరించారు.

కేంద్ర సాయం అందించండి

షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్‌ను ముఖ్యమంత్రి కోరారు. ఈ సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణకు సుప్రీంకోర్టులో

15 మంది ప్రతివాదులు ఉన్నప్పటికీ, కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మాత్రమే మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరడం న్యాయపరంగా సమంజసం కాదని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రధాన పిటిషన్‌లోని లోపాలను సవరించకుండా విచారణ కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేస్తూ, ముందుగా వాటిని సరిదిద్దాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిటిషన్‌లోని లోపాలను సవరించిన అనంతరం మిగిలిన అంశాలపై విచారణ చేపట్టి, అవసరమైతే తదుపరి ఆదేశాలు జారీ చేస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. దీంతో పోలవరం ప్రాజెక్టు, గోదావరి జలాల వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై తెలంగాణ ప్రభుత్వం కోరిన తక్షణ ఉపశమనం లభించలేదు. పిటిషన్‌లోని లోపాలు సవరించిన తర్వాతే కేసు మళ్లీ విచారణకు వచ్చే అవకాశం ఉందని కోర్టు స్పష్టం చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## చిన్నారులకు

పెట్టుకున్నట్లు వివరించారు. ప్రతి చిన్నారికి ఈ మాత్ర తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. నులిపురుగుల సమస్య పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అందరూ బాధ్యతగా సహకరించాలని కోరారు.



**కనిపించని శత్రువు.. కట్టడి అవసరం!**

"నులిపురుగులు బయటకు కనిపించకపోయినా పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను దెబ్బతీసే ప్రమాదకరమైన శత్రువులు. వీటి వల్ల రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి చదువుపై ఏకాగ్రత దెబ్బతింటుంది. మాత్ర వేయడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి, చురుగ్గా మారుతారు."
-దామోదర రాజానర్సింహా, ఆరోగ్య శాఖ మంత్రి

మూడు శాఖల సమన్వయం..

వైద్యారోగ్యశాఖతో పాటు విద్యాశాఖ, మహిళా-శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రా ల్లో ఈ పంపిణీ చేపట్టారు. సోమవారం ఏ కారణం చేతనై నా మాత్ర తీసుకోలేకపోయిన పిల్లల కోసం ఈనెల 20( జులై 20)ప్రత్యేక మాప్ -అప్ కార్యక్రమం నిర్వహించి అందరికీమాత్రఅందేలా చూస్తామని మంత్రి వెల్లడించారు.

పరిశుభ్రతే పరమావధి!

కేవలం మాత్రల పంపిణీతోనే సరిపెట్టకుండా, చిన్నారుల్లో ఆరోగ్య సూత్రాలపై విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, రక్షిత తాగునీరు తాగడం, పండ్లు, కూరగాయలను కడిగి తినడం వంటి మంచి అలవాట్లను పాఠశాల స్థాయి నుంచే నేర్పించాలని సూచించారు.

## సీఎం రేవంత్‌పై

ఆత్మీయ సమ్మే ళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

?కరువు పరిస్థితులపై విలేకర్లు ప్రశ్నిస్తే.. ఒక ముఖ్యమంత్రి స్థానంలో ఉండి 'కోస్తాం, రక్తం చల్లి పంటలు పండిస్తాం' అని హింసను ప్రేరేపించేలా మాట్లాడటం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. అన్ని ఛానళ్లలో ఈ వ్యాఖ్యలు లైవ్ వచ్చినా డీజీపీ ఎందుకు కేసు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానమేనని, సీఎం రేవంత్ రెడ్డిపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నేతల జోక్యంతోనే నిందితులకు కొమ్ముకాపు!

షాబాద్ ఘటనలో స్థానిక కాంగ్రెస్ నాయకుడి జోక్యం వల్లే నిందితుడు తప్పించుకోగలిగాడని, పోలీసులు సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. సోషల్ మీడియా పోస్టులపై చూపే శ్రద్ధ, వేగం.. రాష్ట్రంలో గంజాయి రవాణా, మహిళలపై జరుగుతున్న ఘోర నేరాల నియంత్రణపై పోలీసులు ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు.

హామీల అమలు శూన్యం.. రైతాంగం గోస!

కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తిగా అటకెక్కించిందని ధ్వజమెత్తారు. రైతుబంధు, రైతుబీమా వంటి కీలక పథకాలను నిలిపివేసి రైతులను గోస పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఇవ్వడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడం లేదని విమర్శించారు.

ప్రాజెక్టుల సాధన కోసం భారీ 'పాదయాత్ర'!

నారాయణఖేడ్, ఆందోల్ ప్రాంతాల సుదీర్ఘ కల అయిన సంగమేశ్వర--బసవేశ్వర ప్రాజెక్టు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిలిపివేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. రైతుల హక్కుల కోసం, బసవేశ్వర ప్రాజెక్టును సాధించుకోవడం కోసం త్వరలోనే బసవేశ్వర విగ్రహం నుండి సంగమేశ్వర వరకు భారీ పాదయాత్ర చేపడతామని ప్రకటించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**"ట్విట్టర్, సోషల్ మీడియా పోస్టులపై చూపే శ్రద్ధ, వేగం.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై, నేరాల అదుపుపై పోలీసులు ఎందుకు చూపించడం లేదు?' --- టి. హరీశ్ రావు, మాజీ మంత్రి**

## 'మా రక్తం తీసుకో..

చేశారు.

?రాజకీయ విమర్శలు పక్కనబెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు వెంటనే సాగునీరు అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైతే తమ రక్తాన్ని కూడా అర్పించడానికి సిద్ధమని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

పోలీసుల అరెస్టులు - ఉద్రిక్తత

రక్తదాన శిబిరం అనంతరం సేకరించిన రక్త సంచులతో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ విద్యార్థి నేతలను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కార్యకర్తలు మండిపడ్డారు. కాళేశ్వరం అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఆరోపణలతో రాష్ట్రంలో రాజకీయ వేడి మరింత ముదిరింది

## అంతర్జాతీయ వేదికపై తెలంగాణ

సాధించిన ప్రవల్లికకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చైనాను వెనక్కి నెట్టి.. రికార్డు టైమింగ్‌తో!

మహిళల 4 ఐ 400 మీటర్ల రిలే ఫైనల్లో భారత క్వార్టెట్ అసాధారణ పోరాటాన్ని ప్రదర్శించింది. ప్రవల్లిక, శ్రావణి సచిన్ సాంగ్లే, సాంద్రమోల్ సాబు, నోఫిసా ఖతూన్‌లతో కూడిన భారత బృందం నిర్ణీత రేసును కేవలం 3:33.62 సెకన్లలో ముగించి ప్రథమ స్థానంలో నిలిచింది. బలమైన ప్రత్యర్థి, ఆతిథ్య దేశమైన చైనాను అధిగమించి భారత్ ఈ పసిడి పతకాన్ని కైవసం చేసుకోవడం విశేషం.

పట్టుదలకు నిదర్శనం.. యువతకు స్ఫూర్తి: సీఎం రేవంత్ రెడ్డి

"తాపీ మేస్త్రీ కూతురైన ప్రవల్లిక నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీలేదని నిరూపించింది. నల్గొండలోని ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతూ, డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొంది నేడు అంతర్జాతీయ వేదికపై రాణించడం గర్వకారణం. ఆమె దేశంలోని యువ క్రీడాకారులందరికీ ఆదర్శంగా నిలుస్తోంది" అని సీఎం ప్రశంసించారు. ప్రవల్లికను తీర్చిదిద్దిన కోచ్‌లను కూడా ఈ సందర్భంగా సీఎం అభినందించారు.

దేశీయంగా 'పతకాల' రికార్డు

అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడానికి ముందే ప్రవల్లిక దేశీయంగా తన సత్తా చాటారు. వివిధ క్రీడా వేదికల్లో 23స్వర్ణాలతో సహా మొత్తం 35రాష్ట్ర స్థాయి పతకాలను సాధించి అద్భుతమైన రికార్డును తన పేరిట లిఖించుకున్నారు.

భారత్‌కు 16 పతకాలు

ఈ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు సమిష్టిగా రాణించి పతకాల పంట పండించారు. ఓవరాల్‌గా భారత్ 3 స్వర్ణ, 4 రజత, 9 కాంస్య పతకాలతో కలిపి మొత్తం 16 పతకాలను తన ఖాతాలో వేసుకుంది. భారత జట్టులోని క్రీడాకారులందరికీ సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

## దేవాదులకు వేగం..

ప్రాజెక్టుకు అవసరమైన నిధుల విషయంలో ఎలాంటి కొరత ఉండదని, పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్టును సోమవారం సందర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రాజెక్టు పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులు ప్రాజెక్టు పురోగతిపై వివరాలు అందించగా, పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.ప్రాజెక్టు ద్వారా 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించడంతో పాటు 22 రిజర్వాయర్లను నింపేలా కార్యాచరణ అమలు చేస్తున్నామని భట్టి తెలిపారు. దేవాదుల పంపింగ్ వ్యవస్థను పూర్తి సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు సాగునీటి కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.



భూసేకరణ వేగవంతం చేయాలి

సమ్మక్క--సారలమ్మ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రులు, అనంతరం గుట్టల గంగారం సమీపంలోని జె. చొక్కారావు దేవాదుల వాటర్ పాయింట్‌ను సందర్శించి మోటార్ల పనితీరు, ఎత్తిపోతల సామర్థ్యాన్ని సమీక్షించారు. తరువాత నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో పెండింగ్ పనులు, భూసేకరణ, మోటార్ల నిర్వహణ, సాగునీరు--తాగునీటి సరఫరాపై అధికారుల ప్రజెంటేషన్‌ను పరిశీలించి, అడ్డంకులను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

రైతాంగానికే తొలి ప్రాధాన్యం

పెండింగ్ బిల్లులను ఇప్పటికే విడుదల చేశామని, ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించి రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. సాగునీరు, తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

# ఎల్‌నినోకు ముందస్తు కవచం

- మూడు దశల కార్యాచరణకు సిద్ధం
- రైతు నష్టపోకుండా అన్ని చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**హైదరాబాద్, జూలై 13 (మన విశ్వం):** వానాకాలం--2026లో ఎల్‌నినో ప్రభావాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇక్రిశాట్‌లో భారత వాతావరణ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మూడు దశల ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు. రైతులు ఎలాంటి నష్టం చవిచూడకుండా శాస్త్రీయ విధానాలతో ముందుకు సాగాలని అధికారులకు ఆదేశిం చారు. శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి వ్యవసాయ యాజమాన్య పద్ధతిని క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, వాటిని తప్పనిసరిగా అమలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించాలని, వర్షాభావ పరిస్థితులు తలెత్తిన వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణను అమలు చేయాలని సూచించారు. రైతులకు సమయానుకూలంగా శాస్త్రీయ సలహాలు అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. వర్షాలు ఆలస్యమైనా రైతులకు విత్తనాల కొరత లేకుండా ముందుగానే అవసరమైన నిల్వలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని వెల్లడించారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి వారం మండలాల వారీగా వర్షపాతం, భూగర్భ జలాలు, నీటి లభ్యత, నేల తేమ, పంటల పరిస్థితి, వాతావరణ అంచనాలు, సాగునీటి అందుబాటు వంటి వివరాలతో సమగ్ర వ్యవసాయ--వాతావరణ బులెటిన్ విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమాచారాన్ని రైతు వేదికలు, గ్రామపంచాయతీలు, వ్యవసాయ అధికారులు, సామాజిక మాధ్యమాలు, స్థానిక మాధ్యమాల ద్వారా ప్రతి రైతుకు చేరవేయాలని సూచించారు. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల సాగుపై శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని మంత్రి కోరారు. వర్షాలు ఆలస్యమైతే తక్కువ కాలంలో పండే పంటలను ఎంచుకోవడం, నేల తేమను సంరక్షించడం, నీటి పొదుపు పద్ధతులను అమలు చేయడం, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఎల్‌నినోపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అవసరమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ఇప్పటికే సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతు నష్టపోకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని, శాస్త్రీయ సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

# తూర్పు తండాలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరం




- పాల్గొన్న సర్పంచ్ గుగులోతు పొట్యా నాయక్
- బాలవికాస ఆధ్వర్యంలో మెడికేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో

**దంతాలపల్లి జులై 13( మన విశ్వం):** మండలం తూర్పు తండా గ్రామంలో తొర్రూర్ మెడికేర్ హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ గూగుల్ పొట్యా మాట్లాడుతూ మా గ్రామంలో ఇలాంటి సౌకర్యం చేయడానికి ఎవరు ముందుకు రారు ఇలాంటి సమయంలో మా గ్రామాన్ని బాలవికాస ద్వారా ఉచిత వైద్య శిబిరం పెట్టడం చాలా బాగుంది. సీజనల్ వ్యాధుల గురించి బీపీ షుగర్ టెస్టులు మా గ్రామంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరం పెట్టించడం చాలా బాగుంది అన్నారు. ప్రస్తుతం పని ఒత్తిడి వల్ల ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం జరుగుతుంది, కాబట్టి మా గ్రామానికి వచ్చి ఉచిత పరీక్షలు చేయడం మెడికల్ హాస్పిటల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ నరేష్ చైర్మన్ రాములు మెడికేర్ హాస్పిటల్ ప్రాముఖ్యతను హాస్పటల్ సౌకర్యాల గురించి వివరించడం జరిగింది ,24 గంటలు అంబులెన్స్ సౌకర్యము వివరించారు. హాస్పిటల్ సిబ్బంది సాయి కీర్తి శిరీష బాలవికాస కోఆర్డినేటర్స్ కందునూరు సుకన్య, మార్గం శోభారాణి, చిలకమరి యాక లక్ష్మి ,వార్డ్ నెంబర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీను,సిబ్బంద,గ్రామ పెద్దలు ,150 మంది ఉచిత పరీక్షలు చేయించడం జరిగింది.

# రూ.339 కోట్ల రహదారులకు శ్రీకారం

- హామ్ రోడ్ల పనులకు మంత్రుల శంకుస్థాపన
- సాగునీరు, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం




**జోగులాంబ గద్వాల, జూలై 13 (మన విశ్వం ):** జోగులాంబ గద్వాల జిల్లాలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ధరూర్ మండల కేంద్రంలో రూ.339.39 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హామ్ రోడ్ల నిర్మాణ పనులకు రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి దేశంలోనే అత్యధికంగా నిధులు కేటాయించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ అవకాశాలు, ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇచ్చే విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళా సంఘాలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. సంక్షేమంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి రూ.25 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామని తెలిపారు. గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచడం ద్వారా కరువు పరిస్థితుల్లోనూ తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే ఆయకట్టు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందని వెల్లడించారు.

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రహదారులకు మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందన్నారు. గతంలో కూడా పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు. జిల్లాలో సాంకేతిక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, వివిధ సంస్థల చైర్మన్లు, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో రహదారుల నిర్మాణంతో పాటు సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు తెలిపారు.

# నంద్ కిషోర్ గోయెంకా మృతి పట్ల సీఎం సంతాపం

- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
- సామాజిక సేవలను స్మరించిన రేవంత్ రెడ్డి
- దివంగత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన



**హైదరాబాద్, జూలై 13 (మన విశ్వం ):** ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర తండ్రి, ప్రముఖ సామాజిక సేవకుడు నంద్ కిషోర్ గోయెంకా మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నంద్ కిషోర్ గోయెంకా మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సమాజ సేవలో ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం ఆదర్శప్రాయమని అన్నారు.

దివంగత ఆత్మకు శాంతి చేకూరాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. ఈ క్లిష్ట సమయంలో గోయెంకా కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ఆకాంక్షించారు. నంద్ కిషోర్ గోయెంకా కుటుంబానికి ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని పొందాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# షాబాద్ హంతకుడు మృతి

- పెంజర్లలో శవమై కనిపించిన రాజ్‌కుమార్
- ఆత్మహత్యగా అనుమానం.. దర్యాప్తు కొనసాగింపు



**రంగారెడ్డి, జూలై 13 (మన విశ్వం ):** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో భార్య, ఇద్దరు పిల్లలతో పాటు మరో ముగ్గురిని అత్యంత దారుణంగా హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడు బి. రాజ్‌కుమార్ (29) సోమవారం మృతిగా కనిపించాడు. హైదరాబాద్ శివారులోని కొత్తూరు మండలం పెంజర్ల సమీపంలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, ఇతర ఉన్నతాధికారులు మృతదేహాన్ని పరిశీలించి అది రాజ్‌కుమార్‌దేనని నిర్ధారించారు. మృతదేహం సమీపంలో విషం సీసా లభించడంతో అతను విషం తాగి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మరణానికి గల ఖచ్చితమైన కారణం వెల్లడవుతుందని తెలిపారు.

ఈ నెల 10వ తేదీ రాత్రి షాబాద్ మండలంలో రాజ్‌కుమార్ అత్యంత దారుణంగా ఆరుగురిని హత్య చేసిన విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తనపై పోక్సో కేసు నమోదు చేసిన 17 ఏళ్ల బాలిక, ఆమె తల్లి, నాయనమ్మతో పాటు తన భార్య సరిత, ఇద్దరు కుమారులను కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటన అనంతరం పరారైన అతని కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. హత్యలకు పాల్పడిన అనంతరం రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పడంతో పాటు తాను కూడా చనిపోతున్నట్లు తెలిపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోక్సో కేసు నమోదైనందుకు కక్ష పెంచుకునే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇటీవలే అతనికి ముందస్తు బెయిల్ లభించినట్లు అధికారులు తెలిపారు.

నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతి ప్రకటిస్తూ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా గాలింపు చేపట్టారు. ఇదే సమయంలో బాధితుల కుటుంబ సభ్యులు తమకు నిందితుడి నుంచి ప్రాణహాని ఉందని ముందుగానే ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు తగిన రక్షణ కల్పించలేదని ఆరోపించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చ జరిగింది. బాధితుల ఫిర్యాదుల నేపథ్యంలో పోక్సో కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న షాబాద్ ఎస్సై టి. రమేశ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. రాజ్‌కుమార్ మృతిపై, అలాగే షాబాద్ హత్యల కేసులోని అన్ని కోణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# సింగరేణికి కేంద్రం అండ



- తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుపై హర్షం
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై రామ్‌చందర్‌రావు విమర్శలు

**కొత్తగూడెం, జూలై 13 (మన విశ్వం ):** కొత్తగూడెంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్రలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం సింగరేణి భవిష్యత్తుకు కీలక మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని, కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోలేదని రామ్‌చందర్‌రావు ఆరోపించారు. సంస్థను అప్పుల భారంలోకి నెట్టి, అనిశ్చిత పరిస్థితుల్లోకి తీసుకెళ్లారని విమర్శించారు. కార్మికుల సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చేసిన కృషి ఫలితంగానే నైని, తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌లు సింగరేణి సంస్థకు కేటాయించబడ్డాయని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వానికి సింగరేణి కార్మికులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయింపుతో సింగరేణి సంస్థ ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం అవుతుందని రామ్‌చందర్‌రావు అభిప్రాయపడ్డారు. బొగ్గు ఉత్పత్తి పెరగడంతో పాటు సంస్థ ఆదాయం కూడా వృద్ధి చెందుతుందని, దీని వల్ల సంస్థ మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని వివరించారు.ఈ నిర్ణయం ద్వారా కొత్త ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడతాయని ఆయన అన్నారు. రాబోయే దశాబ్దాల పాటు వేలాది మంది సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు ఉపాధి భరోసా లభిస్తుందని, బొగ్గు పరిశ్రమ అభివృద్ధికి ఇది కీలక నిర్ణయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని రామ్‌చందర్‌రావు తెలిపారు. కార్మికుల సంక్షేమం, సంస్థ విస్తరణ, బొగ్గు ఉత్పత్తి పెంపు లక్ష్యంగా మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొంటూ, సింగరేణి మరింత అభివృద్ధి చెందేలా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడించారు.

# ప్రతి ఓటూ విలువైనదే.. 'ఎస్ ఐ ఆర్' పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి: ఆడెపు విక్రమ్

- ఐనవోలు మండలంలోని వివిధ గ్రామాల్లో ముమ్మర పర్యటన



**ఐనవోలు, జూలై 13(మన విశ్వం):** దేశంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ప్రస్తుతం జరుగుతున్న సమగ్ర ఓటు సర్వే (ఎస్ ఐ ఆర్) పై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐనవోలు మండల ఎస్ ఐ ఆర్ కన్వీనర్ ఆడెపు విక్రమ్ పిలుపునిచ్చారు.

వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ వర్ధన్నపేట కన్వీనర్ కొండేటి శ్రీధర్ ఆదేశాల మేరకు సోమవారం ఐనవోలు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ముమ్మరంగా పర్యటించారు. మండలంలోని ఐనవోలు, కొండపర్తి, ముల్కలగూడెం, ఒంటిమామిడిపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని ఎలక్షన్ బూతులను ఆయన సందర్శించి, సర్వే ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆడెపు విక్రమ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఓటు సర్వేపై గ్రామ గ్రామాన ప్రజల్లో అవగాహన పెరిగిందని అన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం లేదని ఆయన భరోసా ఇచ్చారు. భారత ప్రభుత్వం చేపట్టిన ఈ 'ఎస్ ఐ ఆర్' అనేది కొత్త కార్యక్రమమేమీ కాదని, "ఒకే దేశం -ఒకే ఓటు" అనే లక్ష్యంతో సాగుతోందని స్పష్టం చేశారు. ఈ సర్వే వల్ల దేశంలోని అక్రమ చొరబాటుదారులకు మాత్రమే ఓటు పోతుందనే భయం పట్టుకుందని ఆయన పేర్కొన్నారు.

?"సర్వే గడువు దగ్గర పడుతున్న వేళ.. బూత్ లెవెల్ అధికారులు (బి ఎల్ ఓ లు), గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేయాలి. ప్రతి ఓటరు ఈ సర్వేలో పాల్గొనేలా తగిన చర్యలు తీసుకోవాలి."అని ఆడెపు విక్రమ్ అన్నారు.ఈ పర్యటనలో ఆయా గ్రామాల శక్తి కేంద్రం ఇంచార్జ్ లు కోట కిరణ్, దొణికెల వెంకటేష్, గుండెబోయిన వెంకటేష్ గౌడ్, ఆయా బూత్‌ల బి.ఎల్.ఓలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అతివేగమే ప్రమాదాలకు కారణం

- వేగ నియంత్రణపై తెలంగాణ పోలీసుల హెచ్చరిక
- నిబంధనలు పాటించాలని సూచన
- సురక్షిత ప్రయాణమే కుటుంబానికి రక్షణ




**హైదరాబాద్, జూలై 13 (మన విశ్వం ):** అతివేగంగా వాహనాలు నడపడం వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలంగాణ పోలీసులు ప్రజలను హెచ్చరి ంచారు. వేగ నియంత్రణ పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొంటూ ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని చేపట్టారు. తెలంగాణ పోలీసులు విడుదల చేసిన అవగాహన పోస్టర్‌లో జీవితంలో వేగంగా ఎదగాలని, కానీ రహదారులపై వేగాన్ని నియంత్రించాలని సూచించారు. కాసేపు ఆలస్యంగా గమ్యస్థానానికి చేరుకున్నా పరవాలేదని, అతివేగం మాత్రం ప్రాణాలను ప్రమాదంలో పడేస్తుందని హెచ్చరించారు.

రహదారి నిబంధనలు పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని పోలీసులు తెలిపారు. వేగ పరిమితులను తప్పనిసరిగా పాటిం చడంతో పాటు నిర్లక్ష్యంగా ఓవర్‌టేక్ చేయడం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలంటే బాధ్యతాయుతంగా వాహనం నడ పాలని తెలంగాణ పోలీసులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, వేగ నియ ంత్రణతోనే కుటుంబాలకు సురక్షిత భవిష్యత్తు అందించవచ్చని తెలిపారు. "సురక్షితంగా ఇంటికి చేరడమే ముఖ్యమైన విజయం" అనే సందేశాన్ని ప్రతి వాహనదారుడు గుర్తుంచుకోవాలని సూచించారు.

# సీసీఐ కోసం బీఆర్ఎస్ ఢిల్లీ బాట

- జూలై 15న కేంద్ర మంత్రిని కలవనున్న బీఆర్ఎస్
- పునఃప్రారంభానికి వినతిపత్రం సమర్పణ




**ఆదిలాబాద్, జూలై 13 (మన విశ్వం ):** ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమను తక్షణమే పునఃప్రారంభించాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి ఈ నెల 15న ఢిల్లీకి ప్రతినిధి బృందాన్ని పంపనుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి. రామారావు, మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలోని సీసీఐ సాధన కమిటీ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించనుంది. ఈ ప్రతినిధి బృందంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్రతో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. ఆదిలాబాద్ ప్రజల చిరకాల డిమాండ్ అయిన సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా కోరడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని పార్టీ తెలిపింది.

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పలుమార్లు ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి సీసీఐ పునరుద్ధరణ అంశాన్ని ప్రస్తావించినట్లు పార్టీ పేర్కొంది. అలాగే అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కె.టి. రామారావు కూడా పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు అందజేసినట్లు వెల్లడించింది. సీసీఐ పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం, రాయితీలు అందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ గత 13 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రాలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి దెబ్బతిందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు కోల్పోయాయని పేర్కొంది.

2019, 2024 ఎన్నికల సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ నాయకులు సీసీఐని తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదని బీఆర్ఎస్ విమర్శించింది. ప్రభుత్వ రంగ సంస్థను పునరుద్ధరించకుండా ప్రైవేటీకరణ దిశగా చర్యలు జరుగుతున్నాయంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధి అవకాశాల పెంపు, పారిశ్రామికాభివృద్ధికి సీసీఐ పునఃప్రారంభం అత్యంత కీలకమని బీఆర్ఎస్ పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి జోక్యం చేసుకుని పరిశ్రమ పునరుద్ధరణపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేయనుంది.

# అయ్యప్ప స్వామిని దర్శించిన కిషన్ రెడ్డి



- సింగరేణి భరోసా యాత్రకు ముందు ప్రత్యేక పూజలు
- ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు
- పార్టీ నాయకులతో కలిసి ఆలయ సందర్శనం

**హైదరాబాద్, జూలై 13 (మన విశ్వం ):** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి సింగరేణి భరోసా యా త్రకు బయలుదేరే ముందు హైదరాబాద లోని కర్మన్‌ఘాట్ శ్రీ హరిహర క్షేత్ర అయ్యప్ప స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయ ంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అయ ్యప్ప స్వామిని దర్శించిన కిషన్ రెడ్డి దేశ ప్రజల ందరికీ శాంతి, సుఖసంతోషాలు, ఆయురా రోగ్యాలు, శ్రేయస్సు కలగాలని ప్రార్థించారు. దేశ అభివృద్ధి, ప్రగతి కోసం అందరికీ శక్తి, వివేకం ప్రసాదించాలని అయ్యప్ప స్వామిని వేడుకు న్నట్లు తెలిపారు. సింగరేణి భరోసా యాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే సంకల్పంతో ఈ యాత్ర చేపడుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణతో పాటు తెలంగాణ బీజేపీకి చెందిన పల ువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఆల య అర్చకులు వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# విద్యార్థులకు నైపుణ్యాల వేదిక

- స్కిల్ ప్లస్ శిక్షణ కేంద్రం ప్రారంభం
- ఉద్యోగ అవకాశాలకు ఆధునిక శిక్షణ
- మంత్రి కొండా సురేఖ




**వరంగల్, జూలై 13 (మన విశ్వం ):** వరంగల్‌లోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దేశ్‌పాండే స్కిల్లింగ్ బ్రిడ్జ్ టు ఆపర్చునిటీస్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన "స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్"ను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యాలను పెంపొందించే అవకాశం లభించనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడ ుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కూడా అత్యంత అవసరమని అన్నారు. ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ శిక్షణ కేంద్రం ఆ దిశగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా విద్యార్థులకు ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ఉద్యోగాలకు అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు ఇలాంటి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. విద్యాభ్యాసంతో పాటు నైపుణ్యాల పెంపుదలపై దృష్టి సారిస్తే దేశ, విదేశాల్లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థల సహకారంతో మరిన్ని శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి యువతను స్వయం ఉపాధి, ఉద్యోగ రంగాలకు సిద్ధం చేసే చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, దేశ్‌పాండే స్కిల్లింగ్ సంస్థ ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణ కేంద్రాన్ని సమర్థంగా వినియోగించుకుని ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు.

# సర్పంచ్ జ్యోతి బలవన్మరణం

- నిర్మల్ జిల్లాలో విషాద ఘటన
- ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్న సర్పంచ్
- కారణాలపై పోలీసుల దర్యాప్తు



**నిర్మల్, జూలై 13 (మన విశ్వం):** నిర్మల్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. తానూరు మండలం బోరిగావ్ గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపడంతో పాటు స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సర్పంచ్ జ్యోతి బలవన్మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలి పారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు లేదా ఇతర వ్యక్తిగత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు దర్యాప్తులో లభించే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# సింగరేణి అధికారులకు భరోసా

- సమస్యల పరిష్కారానికి భట్టి ఆదేశం
- రెండు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సూచన
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, జూలై 13 (మన విశ్వం ):** సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. బొగ్గు గనుల సంస్థల తరహాలో అధికారుల వేతన సవరణ, పనితీరు ఆధారిత ప్రోత్సాహక చెల్లింపుల అమలుపై అధికార సంఘం చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరులో కీలక పాత్ర పోషించినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు సింగరేణి అధికార సంఘం నాయకులు ఉప ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి యాజమాన్యానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వారి వినతులపై సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క వెంటనే సింగరేణి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి చైర్మన్-కమ్-మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రుతో జరిగిన సమావేశంలో అధికారుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి, ఇంధన భద్రతకు సింగరేణి సంస్థ కీలకమని, కార్మికులు, అధికారులు సంస్థ అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని, ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో వారి విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమమే సంస్థ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. ప్రపంచీకరణ, పెరుగుతున్న పోటీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సంస్థ పురోగతికి అధికారులు సానుకూల దృక్పథంతో పనిచేయాలని అధికార సంఘం నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనతో పాటు అధికారుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చూపుతున్న చొరవను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సింగరేణి అభివృద్ధి కార్యక్రమాలకు అధికారుల తరఫున పూర్తి సహకారం అందిస్తూ, సంస్థ సుస్థిరాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# నోట్లో ఈ లక్షణాలు తరచూ కనిపిస్తే జాగ్రత్త.. ఇతర అవయవాలపై ప్రభావం పడుతుంది..



నోటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే శరీరంలోని ఇతర అవయవాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిగుళ్ల నుంచి రక్తస్రావం, నోటి దుర్వాసన వంటి సమస్యలను చాలామంది చిన్నవిగా భావించి పట్టించుకోరు. అయితే ఇవి కొన్ని సందర్భాల్లో గుండె జబ్బులు, మధుమేహం, పోషకాహార లోపాలు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు ముందస్తు హెచ్చరికలుగా ఉంటాయని చెబుతున్నారు. అందుకే నోటిలో కనిపించే అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైతే వైద్యులను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు. రోజూ నోరు శుభ్రంగా ఉంచుకున్నప్పటికీ నోటి నుంచి నిరంతరం దుర్వాసన వస్తుంటే అది చిగుళ్ల వాపుకు సంకేతం అయ్యే అవకాశాలు ఉంటాయి. చిగుళ్లలో ఉండే బ్యాక్టీరియా, వాపు వల్ల ఉత్పత్తయ్యే రసాయనాలు రక్తప్రసరణలోకి చేరి రక్తనాళాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల దీర్ఘకాలిక చిగుళ్ల వాపు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. చిగుళ్ల గాయాలు, నోరు ఎండిపోవడం..చిగుళ్లపై గాయాలు నెమ్మదిగా మానడం, తరచూ నోరు ఎండిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవడం అవసరం.

# యునాని వైద్యానికి ప్రాధాన్యం

- నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశం
- ఖాళీల భర్తీ, నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచన



**హైదరాబాద్, జూలై 13 (మన విశ్వం ):** యునాని వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి నాణ్యమైన వైద్యం అందేలా అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయుష్ శాఖ పనితీరు, నిజామియా టిబ్బీ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, నిర్మాణ పనులు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. యునాని వైద్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ నిజామియా టిబ్బీ కళాశాల, నిజామియా జనరల్ ఆస్పత్రి రాష్ట్రంలో యునాని వైద్య సేవలకు ప్రతిష్ఠాత్మక సంస్థలని మంత్రి పేర్కొన్నారు. ఈ సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బయటి రోగుల విభాగం భవనం, ఔషధ నిల్వ భవనం పనులను వేగవంతం చేసి వచ్చే జనవరి నాటికి పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆస్పత్రిలో వైద్యులు, బోధనా సిబ్బంది, ఇతర ఉద్యోగుల ఖాళీలు ఉండటం వల్ల వైద్య సేవలు, విద్యా కార్యక్రమాలపై ఎలాంటి ప్రభావం పడకుండా వెంటనే ఖాళీల భర్తీకి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. యునాని వైద్యశాలలు, ఆస్పత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఆయుష్ శాఖ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు శాఖ పురోగతిని వివరించారు. గత ఏడాది 138 మంది సహాయ ఆచార్యుల నియామకంతో వైద్యుల కొరత గణనీయంగా తగ్గిందని తెలిపారు. నిజామియా టిబ్బీ కళాశాల, నిజామియా జనరల్ ఆస్పత్రి వారసత్వ భవనాల పునరుద్ధరణతో పాటు కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 52.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. యునాని ఔషధాల కొనుగోలు, పంపిణీ కూడా నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు. శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. రాష్ట్ర స్థాయి యునాని ఔషధ తయారీ కేంద్రం ఏర్పాటు కోసం సిద్ధం చేసిన ప్రాజెక్టు ప్రతిపాదనను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

మౌలాలిలోని ప్రభుత్వ యునాని వైద్యశాల భవనానికి సంబంధించిన సమస్యలను పరిశీలించి అక్కడ వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మీర్ జుల్ఫికర్ అలీ, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆయుష్ శాఖ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు, నిజామియా టిబ్బీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యునాని వైద్య సేవలను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

# ఫెన్సింగ్‌లో కాంస్య పతకం

- కానిస్టేబుల్‌కు ఎస్పీ ఘన సన్మానం
- మెదక్ పోలీసులకు రాష్ట్రస్థాయి గుర్తింపు



**మెదక్, జూలై 13 (మన విశ్వం):** 5వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్--2026 పోటీల్లో ఫెన్సింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించిన మెదక్ జిల్లా పోలీసు శాఖ కానిస్టేబుల్ రసాల అమర్నాథ్‌ను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించి ప్రశంసలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి మెదక్ జిల్లా పోలీసు శాఖకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ యువ పోలీసు సిబ్బందికి అమర్నాథ్ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఇలాంటి విజయాలు మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి ప్రేరణగా నిలుస్తాయని అన్నారు.పోలీసు శాఖలో విధులు నిర్వర్తించే సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు క్రీడా నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం ద్వారా శాఖ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని, భవిష్యత్తులో జాతీయస్థాయిలోనూ మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖలో క్రీడలకు ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మరింత మంది పోలీసు సిబ్బంది వివిధ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. క్రీడా స్ఫూర్తి విధి నిర్వహణలోనూ సానుకూల ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు.కాంస్య పతకం సాధించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని కానిస్టేబుల్ రసాల అమర్నాథ్ తెలిపారు. ఉన్నతాధికారుల ప్రోత్సాహం, సహచరుల సహకారంతోనే ఈ విజయాన్ని అందుకున్నానని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది రసాల అమర్నాథ్‌కు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఆయన సాధించిన విజయం మెదక్ జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# ఖమ్మం ప్రధాన న్యాయమూర్తికి కలెక్టర్ శుభాకాంక్షలు

- నూతన బాధ్యతలు స్వీకరించిన ఎం. నాగరాజు
- పూల మొక్క అందజేసిన జిల్లా కలెక్టర్
- పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా సత్కారం



**ఖమ్మం, జూలై 13 (మన విశ్వం):** ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం. నాగరాజును జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ భేటీలో నూతన బాధ్యతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజుకు కలెక్టర్ పూల మొక్కను అందజేశారు. ప్రకృతి సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

నూతన బాధ్యతల్లో ప్రధాన న్యాయమూర్తి విజయవంతంగా సేవలందించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించే దిశగా న్యాయవ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయస్థానానికి చెందిన అధికారులు, న్యాయవాదులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. నూతన ప్రధాన న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు పలు వర్గాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# నాచారంలో కమిషనర్ క్షేత్ర పరిశీలన



- పారిశుద్ధ్యంపై అధికారులకు ఆదేశాలు
- దోమల నివారణకు ప్రత్యేక చర్యలు
- అక్రమాలపై కఠిన చర్యల హెచ్చరిక

**హైదరాబాద్, జూలై 13 (మన విశ్వం ):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాచారం సర్కిల్ పరిధిలోని బాబానగర్ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్యం, పట్టణ హరితీకరణ, దోమల నివారణ చర్య లు, పౌర సేవల అమలును పరిశీలి ంచారు. స్థానిక పరిస్థితులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. దోమల వ్యాప్తిని పూర్తిగా అరికట్టేందుకు నిల్వ నీటి ప్రాంతాలను గుర్తించి లార్వా ఉనికిని నిర్మూలించే చర్యలను మరింత వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. ప్రతి ప్రాంతాన్ని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ దోమల పెరుగుదలకు అవకాశం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.హరితీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన మొక్కల పెట్టెల్లో మొక్కలు లేకపోవడం లేదా వాటి నిర్వహణ సరిగా లేకపోతే అలాంటి వాటిని తొలగించి పట్టణ జీవవైవిధ్య విభాగం ద్వారా తిరిగి అభివృద్ధి చేయాలని సూచించారు. నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను వేగంగా తొలగించాలని, అనుమతి లేకుండా వ్యర్థాలను పారబోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. నగర పరిశుభ్రతకు భంగం కలిగించే చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

వ్యాపార సంస్థలు గడువులోగా వ్యాపార అనుమతులను పునరుద్ధరించుకునేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమన్వయంతో కూడిన క్షేత్రస్థాయి తనిఖీలు, పౌర సహకారంతోనే పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన, ఆరోగ్యకరమైన మల్కాజిగిరి నిర్మాణం సాధ్యవంవుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల సమస్యలు

- త్వరిత పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం
- పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని సూచన



**ఖమ్మం, జూలై 13 (మన విశ్వం):** జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఒక్కో వినతిని స్వయంగా పరిశీలించిన కలెక్టర్ సమస్యల స్వరూపాన్ని అడిగి తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా వినతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్హత మేరకు త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిపై సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో తాగునీరు, భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పింఛన్లు, గృహాలు తదితర అంశాలకు సంబంధించిన వినతులు ప్రజావాణిలో ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రతి సమస్యను విడివిడిగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్య పరిష్కారానికి అవసరమైన అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓర్పుతో విని పరిష్కార మార్గం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి అవకాశం ఇవ్వకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై నిర్దేశిత గడువులోగా చర్యలు తీసుకుని పరిష్కార నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ప్రత్యేక ఓటరు సవరణ వేగవంతం

- హెల్ప్‌డెస్క్‌ను తనిఖీ చేసిన కలెక్టర్
- ఫారాల డిజిటలీకరణలో నాణ్యత పాటించాలని ఆదేశం



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 13 (మన విశ్వం ):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ హెల్ప్‌డెస్క్ పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.కొత్తగూడెం పరిధిలోని 66 పోలింగ్ కేంద్రాల్లో ఫారాల పంపిణీ, స్వీకరణ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, బూత్ స్థాయి అధికారులు ఫారాల పంపిణీని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి అర్హ ఓటరికి నిర్ణీత గడువులోపు ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేకరించిన దరఖాస్తులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వెంటనే డిజిటలీకరించాలని, ఈ ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డేటా నమోదు సమయంలో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.

ఇంట్లో అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి అవసరమైన వివరాలు సేకరించాలని, నిర్ణీత గడువులోపు ఫారాల పంపిణీ పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తహసీల్దార్ పుల్లయ్య మాట్లాడుతూ కొత్తగూడెం పరిధిలో 66 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటి పర్యవేక్షణ కోసం ఏడుగురు బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులను నియమించినట్లు కలెక్టర్‌కు వివరించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ పుల్లయ్య, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 335 వినతులు



- ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి
- త్వరిత పరిష్కారానికి అధికారులకు ఆదేశం

**జనగామ, జూలై 13 (మన విశ్వం ):** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మొత్తం 335 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రతి వినతిని సంబంధిత శాఖలకు అప్పగించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. తమ సమస్యలను అధికారులు తప్పకుండా పరిష్కరిస్తారనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించడం ప్రతి శాఖ అధికారుల బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సానుకూల దృక్పథంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, అర్హులైన వారికి ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తుపై చర్యలు తీసుకుని, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్ సమీక్ష



**నాగర్‌కర్నూల్, జూలై 13 (మన విశ్వం):** నాగర్‌కర్నూల్ జిల్లా చర్కొండ గ్రామం, మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ హేమంత్ కేశవ్ పాటిల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక గృహ నిర్మాణ కార్యక్రమం వేగంగా, నాణ్యతతో అమలు కావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పర్యటనలో భాగంగా పునాది దశలో ఉన్న ఇళ్ల నుంచి పైకప్పు నిర్మాణం పూర్తవుతున్న ఇళ్ల వరకు వివిధ దశల్లో సాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని నేరుగా పరిశీలించిన అనంతరం క్షేత్రస్థాయి ఇంజినీర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనుల్లో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు.

లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని, పనుల్లో జాప్యం లేకుండా ప్రతి దశను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రతి ఇంటిని నిర్దేశిత ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేయడం ప్రతి అధికారియుటె బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో సమన్వయంతో పనిచేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేద కుటుంబాలకు శాశ్వత గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. పనులను వేగవంతం చేస్తూనే నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ పురోగతిని సమీక్షిస్తామని వెల్లడించారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి: పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

**- గర్భస్రావ మాత్రలు ఇచ్చి అఘాయిత్యం.. రౌడీషీట్ తెరుస్తామని ఏసీపీ హెచ్చరిక**




గీసుగొండ, జూలై 13(మన విశ్వం): ప్రేమ పేరుతో నమ్మించి ఓ మైనర్ బాలికపై వరుసగా లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా, ఆమె గర్భం దాల్చడంతో మోసపూరితంగా గర్భస్రావం చేయించిన నిందితుడిని గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దారుణానికి సంబంధించిన వివరాలను మామునూరు ఏసీపీ వెంకటేష్ వెల్లడించారు.

**- నమ్మించి అఘాయిత్యం..**

పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన బొడ్డు బన్నీ (21) అనే యువకుడికి, గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మైనర్ బాలికతో 2023లో పదో తరగతి చదువుతున్న సమయంలో స్నేహితురాలి ద్వారా పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానంటూ నమ్మించిన నిందితుడు ఆమెతో తరచూ ఫోన్లో మాట్లాడేవాడు. మార్చి 2023లో బాలిక ఎస్సెస్సీ పరీక్షలు రాస్తున్న సమయంలో ఒక రోజు రాత్రి ఆమె ఇంటి వద్దకు వెళ్లిన బన్నీ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి సమీపంలోని ఒక వెంచర్‌కు తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత కూడా నమ్మించి 2024 వరకు పలుమార్లు ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు.

**- కేకులో గర్భస్రావ మాత్రలు కలిపి..**

ఈ క్రమంలో 2025 మార్చి నెలలో బాధితురాలు గర్భం దాల్చింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు నిందితుడు బన్నీ క్రూరంగా ఆలోచించాడు. బాలిక పుట్టినరోజు సందర్భంగా ఆమెకు తెలియకుండా బర్త్‌డే కేకులో గర్భస్రావ మాత్రలు (అబార్షన్ పిల్స్) కలిపి తినిపించాడు. ఆ తర్వాత ఆమెకు తీవ్ర కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు గర్భస్రావం జరిగినట్లు నిర్ధారించారు.

**- బెదిరింపులు, ఫోన్ ధ్వంసం..**

గర్భస్రావం జరిగిన తర్వాత కూడా నిందితుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. మళ్లీ తన వద్దకు రావాలని బాధితురాలిని వేధించడం ప్రారంభించాడు. నిరాకరించడంతో తిట్టడం, కొట్టడం, చంపేస్తానని బెదిరించడం చేశాడు. నాలుగు రోజుల క్రితం వరంగల్‌లో బాధితురాలిపై దాడి చేసిన నిందితుడు, ఆమె మొబైల్ ఫోన్‌ను కూడా ధ్వంసం చేశాడు.

**- పోలీసుల కఠిన చర్యలు - రౌడీషీట్ హెచ్చరిక**


నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలు గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బొడ్డు బన్నీని సోమవారం అరెస్ట్ చేసి, అతనిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్ ) మరియు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు."మహిళలు, మైనర్ బాలికలపై ఇటువంటి నేరాలకు పాల్పడే వ్యక్తులను ఎంతమాత్రం ఉపేక్షించబోం. నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వారిపై రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేస్తాం."అని మామునూరు ఏసీపీ వెంకటేష్ తెలిపారు.?ఈ కేసు దర్యాప్తులో మామునూరు ఏసీపీ వెంకటేష్‌తో పాటు గీసుకొండ ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్సై కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శుభాంశు శుక్లాను యువత ఆదర్శంగా తీసుకోవాలి




హైదరాబాద్, జులై 13 : భారత వైమానిక దళానికి చెందిన గ్రూప్ కెప్టెన్, వ్యోమగామి శుభాంశు శుక్లాను దేశ యువత ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పిలుపునిచ్చారు. 41 ఏళ్ల విరామం తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన భారతీయుడిగా శుభాంశు శుక్లా చరిత్ర సృష్టించారని కొనియాడారు. (సోమవారం) హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కలామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శుభాంశు శుక్లా రచించిన 'ద సెకండ్ ఆర్బిట్' పుస్తకాన్ని సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాల లకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడారు.శుభాంశు శుక్లా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు.. మిషన్‌లో పైలట్‌గా పాల్గొని శుభాంశు శుక్లా భారత అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారని సీపీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. ఆయన రచించిన 'ద సెకండ్ ఆర్బిట్' పుస్తకంలో అంతరిక్ష యాత్రలో ఎదురైన అనుభవాలు, సవాళ్లను పొందుపరిచారని తెలిపారు. శుభాంశు శుక్లా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని సీపీ సజ్జనార్ ఆకాంక్షించారు.యువత కోసం ఈ పుస్తకాన్ని రచించాను: శుభాంశు శుక్లాఅంతరిక్షం వరకు తన ప్రయాణం వెనుక ఉన్న అనుభవాలను దేశ ప్రజలకు, ముఖ్యంగా యువతకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు శుభాంశు శుక్లా తెలిపారు. హైదరాబాద్‌లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకుంటే ఎలాంటి లక్ష్యం అయినా సాధించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు శుభాంశు శుక్లా సమాధానాలు ఇచ్చారు. అంతరిక్ష యాత్రకు సంబంధించిన తన అనుభవాలను వారితో పంచుకున్నారు.

# షాబాద్ ఆరుగురి హత్య కేసు నిందితుడు రాజ్ కుమార్ మృతి



హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన రంగారెడ్డి జిల్లా షాబాద్ () షాబాద్ హత్యల కేసు నిందితుడు రాజ్ కుమార్ మృతి చెందాడు. కొత్తూరు మండలం పంజర్లలో రాజ్ కుమార్ మృతదేహం లభ్యమైంది. రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమందించారు. స్థానికులు రాజ్ కుమార్ మృతదేహం దగ్గర పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. రాజ్ కుమార్ మేనమామ ఊరిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.షాబాద్‌లో రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురుని నరహంతకుడు రాజ్‌కుమార్ వరుసగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. ఈ మారణహోమాన్ని సృష్టించిన రాజ్ కుమార్ ఆచూకీ కోసం పోలీసులు ఇప్పటికే ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారని తెలిసిందే. మరోవైపు నిందితుడిని పట్టిస్తే రెండు లక్షల రూపాయల నగదు బహుమతిని కూడా ప్రకటించారు.పోక్సో కేసులో బెయిల్ పొంది యథేచ్ఛగా తిరుగుతున్న రాజ్‌కుమార్ పగబట్టి చేసిన ఈ ఘాతుకం కలకలం రేపింది. రెండు గంటల్లో ఏకంగా ఆరుగురిని హతమార్చడం రాజధాని శివారులోని షాబాద్‌ను కుదిపేసింది. కేసు పెట్టిన బాధిత బాలిక కుటుంబాన్ని, ప్రశ్నించిన తన కుటుంబాన్ని సైతం ఆ ఉన్మాది గొంతులు కోసి హతమార్చడం రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసింది.

# కార్మిక కుటుంబాల పిల్లలకు స్కాలర్‌షిప్స్ దరఖాస్తులు షురూ

ప్రతి ఏటా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమ బోర్డుతో కలిసి కార్మికుల పిల్లలకు వార్షిక ఉపకార వేతనాలను అందిస్తాయి. మైనింగ్, బీడీ తయారీ, సినిమాతో పాటు ఇతర కార్మిక రంగాల్లో పని చేసే కుటుంబాలకు చెందిన పిల్లలు దీనికి అర్హులు. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఈ కథనంలో చూద్దాం.ప్రీ-మెట్రిక్ అంటే 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారు. అలాగే పోస్ట్-మెట్రిక్ అంటే ఇంటర్మీడియట్, డిగ్రీ వృత్తిపరమైన కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు దీనికి అర్హులు.విద్యార్థి 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్ పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణులైతేనే అర్హత లభిస్తుంది.దూర విద్య ద్వారా చదువుతున్న విద్యార్థులకూ ఇది వర్తిస్తుంది.విద్యార్థులు గుర్తింపు పొందిన విద్యా సంస్థలో చేరి ఉండాలి.తల్లిదండ్రులు లేదా సంరక్షకులు సంబంధిత రంగంలో కనీసం ఆరు నెలల పని అనుభవం కలిగి ఉండాలి. వారికి నెలవారీ



ఆదాయ పరిమితి రూ.10 వేలు ఉండాలి.రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం ఇదే! : మొదటగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌ను సందర్శించాలి. అందులో స్టూడెంట్ అనే విభాగంపై క్లిక్? చేయాలి. ఆ తర్వాత వన్ టైం రిజిస్ట్రేషన్ (ఓటీఆర్)పై క్లిక్ చేయాలి. అనంతరం మొబైల్ నంబర్, ఓటీపీ, క్యాప్చా కోడ్?ను ఎంటర్? చేయాలి. అలాగే ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి. మెసేజ్ ద్వారా ఓటీఆర్ నంబర్ అందుతుంది. ప్రీ మెట్రిక్? వారు ఆగస్టు 31లోగా అప్లై చేసుకోవాలి. అలాగే పోస్ట్ మెట్రిక చదివే వారు అక్టోబరు 31లోగా రిజిస్టర్ చేసుకోవాలి. ంష్ట్రశీశ్రీఖతీ-ంష్ట్రఱజూ. స్త్రశీఙ. ఱఅ అనే వెబ్‌సైట్‌కి వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలి.ఉపకారవేతనాలు ఇవే! : 1 నుంచి 4వ తరగతి చదివే విద్యార్థులకు రూ.1000 అందిస్తారు. 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు రూ.1500. 9-10వ తరగతి విద్యార్థులకు రూ.2,000 ఇస్తారు. ఇక ఇంటర్మీడియట్ చదివే వారికి రూ.3000, డిగ్రీ, ఐటీఐ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చేసే వారికి రూ.6000 చొప్పున అందిస్తారు. అలాగే బీటెక్, బీఏఎంఎస్ చేసే వారికి రూ.25 వేల ఉపకార వేతనం ఇవ్వనున్నారు.పీఎం ఉచ్చతర్ శిక్షా ప్రోత్సాహన్ స్కాలర్‌షిప్ : పీఎం ఉచ్చతర్ శిక్షా ప్రోత్సాహన్ అనేది విద్యా మంత్రిత్వ శాఖలోని ఉన్నత విద్యా శాఖ ద్వారా నిర్వహించబడుతున్న ఒక ప్రధాప్రోత్సాహన్ అనేది విద్యా మంత్రిత్వ శాఖలోని న స్కాలర్‌షిప్ పథకం. దీని కింద, దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 82 వేల మంది కొత్త విద్యార్థులను ఎంపిక చేస్తారు. గ్రాడ్యుయేషన్, పీజీ, మెడికల్, ఇంజనీరింగ్ చదివే స్టూడెంట్స్ ఈ స్కీమ్ ద్వారా ప్రయోజనాన్ని పొందవచ్చు. ఈ పథకం ప్రధాన లక్ష్యం విద్యార్థుల రోజువారీ విద్యా అవసరాలను తీర్చడం. అర్హత గల విద్యార్థులు నేషనల్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఈ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసేందుకు అక్టోబర్? 31, 2026 చివరి తేదీ

# మత్తుకు అలవాటు పడి - విక్రయదారుల అవతారం : పారిశ్రామిక వాడల్లో గుప్పుమంటున్న గంజాయి



మహబూబ్‌నగర్ జిల్లా:మాదక ద్రవ్యాల వినియోగం పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అంతటా పెరుగుతోంది. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో గంజాయి వాడకం ఎక్కువగా ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పరిశ్రమలు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. జడ్చర్లలో సెజ్ ఉండటంతో అక్కడ వివిధ రాష్ట్రాల వారు ఉంటున్నారు. వారిలో గంజాయి పీల్చేవారి సంఖ్య అధికంగా ఉంది. దాంతో ఆ ప్రాంతం అంతా మత్తులో తూలుతోంది.3, 5, 10 గ్రాముల వరకు ప్యాకెట్ల రూపంలో : ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి సాగు జరుగుతుంది. ఈ ప్రాంతం గుండా ప్రయాణించే వ్యక్తులు తమ స్వస్థలాల నుంచి తిరిగి వచ్చేటప్పుడు గంజాయిని వెంట తెచ్చుకుంటారు. 3, 5, 10 గ్రాముల వరకు ప్యాకెట్ల రూపంలో తయారు చేసి గ్రాముకు రూ.100 నుంచి రూ.150 చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. అమ్మేవాళ్లు అటు పరిశ్రమలో పని చేస్తూ, ఇటు గంజాయి వ్యాపారం చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంత యువత, విద్యార్థులు దీనికి బానిసలుగా మారుస్తున్నారు.గంజాయి దందాలో మహిళలు : ఈ గంజాయి దందాలో మహిళలు కూడా పాల్గొంటున్నారు. జడ్చర్ల బస్టాండులో మే 11న ఆబ్కారీ శాఖ తనిఖీల్లో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. అయితే పట్టుబడ్డ మహిళలిద్దరూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారుగా గుర్తించారు. అక్కడ నుంచి తెచ్చి ఇక్కడి పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది.అలవాటు పడి విక్రేతలుగా అవతారం : ఈ ప్రాంతానికి వచ్చి పని చేస్తున్న కార్మికుల్లో 80 శాతం పైగా బిహార్?, ఒడిశా, పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన వారే ఉన్నారు. వీరంతా జడ్చర్ల, రాజపూర్, బాలానగర్ అలాగే మహబూబ్‌నగర్ ప్రాంతాల్లోని పరిశ్రమల్లో పని చేస్తున్నారు. మొత్తం 50 నుంచి 70 వేల వరకు ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. ఈ కార్మికులు సమీప పట్టణాలు, గ్రామాల్లో అద్దెకు ఉంటున్నారు. అయితే వీరు మొదట గంజాయికి అలవాటు పడి, ఆ తర్వాత విక్రేతలుగా అవతారమెత్తుతు న్నారు5 మండలాల్లో 18 కేసులు :బాలానగర్ ప్రాంతంలో గత ఆరు నెలల్లో రెండు కేసులు నమోదయ్యాయి. దీంట్లో 3.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు సందర్భాల్లోనూ బిహార్‌కు చెందిన వ్యక్తులే పట్టుబడ్డారు. రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లిలో బిహార్‌కు చెందిన కార్మికుడు గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడ్డాడు. అతని దగ్గర కిలోకు పైగా సరకు స్వాధీనం చేసుకున్నారు. రాజాపూర్?లోనే ఒడిశాకు చెందిన మరో కార్మికుడిని అదుపులోకి తీసుకున్నారు.జడ్చర్లలో గడిచిన ఆరు నెలల్లో 6 గంజాయి కేసులు నమోదు అయ్యాయి. దాంట్లో 7.80 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీటిలో నాలుగు కేసుల్లో పట్టుబడ్డ నిందితులు ఇతర రాష్ట్రాల వారిగా గుర్తించారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, బాలానగర్, భూత్పూర్, రాజాపూర్ మండలాల్లో ఆర్నెళ్లలో 18 కేసులు నమోదయ్యాయి.ప్రత్యేక బృందాలతో తనిఖీలు : పారిశ్రామిక ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేపడుతున్నామని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మత్తు పదార్థాల నివారణకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిపై అవగాహన , కౌన్సెలింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు.

# 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి



హైదరాబాద్ :కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు సర్ పై అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ఓట్లు పోకుండా చూసుకోవాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ కోరారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సర్‌పై తొమ్మిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. అన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియను పరిశీలించామని తెలిపారు. ఓటర్ మ్యాపింగ్ సరిగ్గా జరగలేదని, సర్‌పై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని వెల్లడించారు. ఫారాల పంపిణీ అనుకున్న విధంగా జరగాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఒకే రోజు సమగ్ర కుటుంబ సర్వే చేశారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు 37 శాతం మాత్రమే ఫారాలను నింపడం పూర్తయిందని, అదనపు సమయం కావాలని బీఆర్ఎస్ కోరుతుందని అన్నారు. సర్ ప్రక్రియపై ఇప్పటికే బీఆర్ఎస్ శ్రేణుల బృందం కేంద్ర ఎన్నికల సంఘాన్ని, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసిందని వెల్లడించారు. బీఆర్ఎస్ అనేక సూచనలు చేసింది: కర్నె ప్రభాకర్‌బీఆర్ఎస్ నుంచి ఇప్పటికే అనేక విజ్ఞాపన పత్రాలను ఎన్నికల సంఘానికి ఇచ్చామని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సర్ ప్రక్రియపై బీఆర్ఎస్ ఎన్నికల సంఘానికి అనేక సూచనలు చేసిందని అన్నారు. సర్‌పై పూర్తి స్థాయిలో ఎన్నికల కమిషన్ రెడీగా లేదని తెలిపారు. బీఎల్‌వోలు నిర్లక్ష్యంగా ఉంటే ఇబ్బందులు తప్పవని, వారు ప్రతి ఇంటికి వెళ్లాలని, బీఎల్ఏలు వారికి సహకరించాలని కోరారు. దీనిపై రేపు ఎన్నికల సంఘం అధికారులను కలిసి విజ్ఞాపన పత్రం అందిస్తామని పేర్కొన్నారు. నాగర్ సాహెబ్ కుంటలో ఎండీ అస్లాం అనే వ్యక్తి తన ఓటు పోతుందనే భయంతో ఆత్మహత్య చేసుకున్నారని, ఏటూరు నాగారంలో మండల కేంద్రంలో ఫారాలు హైస్కూల్‌లో ఇవ్వాలని ఎండీవో చెప్పారని వెల్లడించారు.


# చ్చిన మాట నిలబెట్టుకున్న కేటీఆర్



మొయినాబాద్, జూలై 13 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఇచ్చిన మాట నిలబె ట్టుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు డప్పు కరంచంద్ రోడ్డు ప్రమాదంలో గత 20 రోజుల క్రితం మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్ మీ కుటుంబానికి మేమున్నామని మనోధైర్యం చెప్పి భరోసా కల్పించారు. భవిష్యత్తులో పిల్లలు ఉన్నత చదువులు చదువుకునే విధంగా వారి పేర్ల మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చాడు. కరంచంద్ కుటుంబానికి ఇచ్చిన మాట ప్రకారం జులై 4వ తేదీన తన ముగ్గురు పిల్లల పేరు మీద రెండు లక్షల చొప్పున ఆరు లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేసి తన మంచి మనసును మరోసారి చాటుకున్నారు.పిల్లల పేరు మీద చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను సోమవారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనికెపల్లి గ్రామంలో కరంచంద్ కుటుంబ సభ్యులను కలిసి అందజేశారు. దీందతో కరంచంద్ భార్య, పిల్లలు ఫోన్ ద్వారా కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి రూ. 20 వేలు, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు కోట్ల నరోత్తం రెడ్డి రూ.25 వేలు కరంచందు కుటుంబానికి అందించాటు.అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కరంచంద్ బీఆర్ఎస్ పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతూ సోషల్ మీడియా వారియర్ గా పనిచేసేవాడని తెలిపారు. బీఆఆర్ఎస్ కార్యకర్తలు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# ఓఆర్ఆర్‌పై అడ్డదిడ్డంగా నడిపే వాహనాలకు చెక్- 16 అంశాలపై ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్న'కెమెరా'

హైదరాబాద్: ఓఆర్ఆర్‌పై లేన్ల గందరగోళం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు వాహనదారులు అవగాహన లేకుండా ఒక్కసారిగా 80 కిలోమీటర్ల లైన్ నుంచి 120 కిలో మీటర్ల లైనులోకి వెళు ్తండటం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. కొన్నిసార్లు వేగంగా వెళ్లే వాహనాన్ని అకస్మాత్తుగా నిలుపు తుండటం వల్ల కూడా ప్రమాదాలు సంభవిసు ్తన్నాయి. ఇలా ఓఆర్ఆర్‌పై అడ్డదిడ్డంగా వాహనాలు నడిపే వారికి ఇక చెక్‌పెట్టనున్నారు. ఏఐతో చెక్ : అతివేగం, అకస్మాత్తుగా లేన్లు మారడం, ఓఆర్ఆర్‌పై వాహనాల నిలుపుదల వల్ల ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు,



హైదరాబాద్ అవుటర్ రింగ్‌రోడ్డు గ్రోత్ కారిడార్ ఆధ్వర్యంలో చర్యల కు ఉపక్రమిం చారు. ఏఐ ఆధారిత మల్టీ వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్ (ఎంవీడీఎస్)ను అందు బాటులోకి తెచ్చారు. తరచూ ప్రమాదాలు, ఉల్లంఘనలు జరిగే 14 ప్రాంతాల్లో శంషాబాద్ నుంచి మేడ్చల్ వరకు దాదాపుగా 70 కిలోమీటర్ల పరిధిలో వీటిని ఏర్పాటు చేశారు.రెండు వైపులా నాలుగు కెమెరాలు : రియల్ టైంలో ఉల్లంఘనలకు చెక్ పెట్టడమే ఈ ఆర్టిఫిషల్? ఇంటెలిజెన్స్ కెమెరాల ప్రత్యేకత. ప్రస్తుతం ఈ వ్యవస్థను బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్‌తో పాటు రియల్ టైంలో ఈ - చలాన్ల జారీ కోసం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఒక ప్రాంతంలోనే రెండు వైపులా నాలుగు కెమెరాలు ఉంటాయి. ఒక్కో కెమెరా 16 రకాల అంశాలను గుర్తిస్తుంది. ప్రత్యేక బృందం 24 గంటలపాటు పర్యవేక్షిస్తుంది. ట్రోయిస్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈ పనులు చేస్తుంది. రూ. 8.26 కోట్ల నిధులను వెచ్చించి ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. వీటి సంబంధించిన నిర్వహణను కూడా ఈ సంస్థే చేపట్టనుంది.

# అభిషేక్ శర్మ ఖాతాలో విచిత్రమైన రికార్డు..!



సౌతాంప్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన ఆఖరి ఐదో టీ20 మ్యాచ్ టీమిండియాకు ఏమాత్రం కలిసిరాలేదు. ఈ మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయం పాలై సిరీస్‌ను చేజార్చుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచులో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ఓ అరుదైన రికార్డు సాధించాడు. సౌతాంప్టన్ మ్యాచులో అభిషేక్ శర్మ ఒక విచిత్రమైన, ఎవరూ ఊహించని అంతర్జాతీయ క్రికెట్ మైలురాయిని అందుకొని రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. అభిషేక్ శర్మ.. వన్డే లేదా టెస్ట్ ఫార్మాట్ ఆడకుండా.. అత్యధిక టీ20 మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా నిలిచాడు. శనివారం భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన ఐదో టీ20 మ్యాచులో అతడు ఈ ఫీట్ సాధించాడు. ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. టీమిండియా తరఫున ఇప్పటివరకు 53 టీ20 మ్యాచులు ఆడాడు. ఈ క్రమంలోనే వెస్టిండీస్ మాజీ స్పిన్నర్ శామ్యూల్ బద్రీని అధిగమించాడు. అతడు గతంలో టెస్ట్ లేదా వన్డే ఫార్మాట్ ఆడకుండా జాతీయ జట్టు తరఫున అత్యధికంగా 52 టీ20లు ఆడాడు. కాగా ఇటీవల భారత జట్టు టీ20 క్రికెట్‌లో పేలవ ప్రదర్శన చేస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో వరుసగా వైట్ వాష్‌కు గురైంది. దీంతో 1601 రోజుల తర్వాత ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్ టైటిల్స్ సాధించిన టీమిండియా.. ఇలాంటి ఫలితాలు అందుకోవడం పట్ల క్రీడా విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు సిరీస్‌లలోనూ అభిషేక్ శర్మ మోస్తరు ప్రదర్శన చేశాడు. ఇంగ్లాండ్‌లో ఐదో టీ20లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. ఈ మ్యాచులో టీమిండియా చిత్తుగా ఓడిపోయింది.

# చిరస్మరణీయ విజయం

**● లార్డ్స్ టెస్టులో టీమిండియా చారిత్రాత్మక గెలుపు ● ఇంగ్లాండ్‌ను చిత్తుగా ఓడించిన భారత్ ● రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత బ్యాటర్ల జోరు**




టీమ్‌ఇండియా మహిళల క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో హర్మన్‌సేన 270 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. క్రికెట్‌కు పుట్టినిల్లుగా భావించే లార్డ్స్ మైదానంలో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించడం భారత మహిళల క్రికెట్‌లో ఇది చరిత్రాత్మకం. రెండో ఇన్నింగ్స్‌లో 457 పరుగుల భారీ టార్గెట్ ఛేదనలో ఇంగ్లాండ్ 186 పరుగులకు కుప్పకూలింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలి, క్రాంతి గౌడ్, దీప్తి శర్మ తలో 2 వికెట్లు పడగొట్టారు. ఇంగ్లాండ్ భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోర్ 130-6తో నాలుగో రోజు ఆట ప్రారంభమైంది. అయితే మునుపటి రోజు జోరును కొనసాగించిన టీమ్‌ఇండియా అమ్మాయిలు అదే జోష్‌లో టపటపా వికెట్లు పడగొట్టారు. దీంతో ఇంగ్లాండ్ ఓవర్‌నైట్ స్కోరుకు 56 పరుగులో జోడించి చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. క్రీజులో కుదురుకొని హాఫ్ సెంచరీ సాధించిన అమీ జోన్స్ (54)ను స్నేహ్ రాణా ఔట్ చేసి మళ్లీ వికెట్ల వేట మొదలు పెట్టింది. ఆ తర్వాత 33 బంతులు ఎదుర్కొని ఒకే ఒక్క పరుగు చేసిన ఇస్సీ వాంగ్‌ను దీప్తి శర్మ క్లీన్ బౌల్డ్ చేసింది. ఆ తర్వాత కాసేపటికే లారెన్ (0)ను కూడా దీప్తినే వెనక్కి పంపింది. అయితే చివర్లో ఎకిల్‌స్టోన్ (50) కాసేపు నిలదొక్కుకోవడంతో భారత్ విజయం కాస్త ఆలస్యం అయ్యింది. చివరికి ఆమెను స్నేహ్ రాణా ఔట్ చేసి భారత్‌కు చరిత్రాత్మక విజయాన్ని అందించింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్, ఇంగ్లాండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును పరిగెత్తించింది. మూడో రోజు ఆటలో ఇంగ్లాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లు ముగిసే సరికి 100/5తో నిలిచింది. ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 357 పరుగులు అవసరం కాగా.. భారత్ మరో ఐదు వికెట్లు సాధిస్తే చరిత్రాత్మక విజయం సాధిస్తుంది. ఓవర్ నైట్ స్కోరు 154/1తో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్ కాసేపటికే వికెట్ కోల్పోయింది. జట్టు స్కోరు 161 వద్ద స్మృతి మంధాన 70 రన్స్ చేసి ఔట్ అయింది. అయితే యస్తికా భాటియా మాత్రం అదరగొట్టింది. లార్డ్స్‌లో శతక్కొట్టి.. టెస్ట్ క్రికెట్‌లో ఇక్కడ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. 113 పరుగులు చేసిన అనంతరం ఆమె పెవిలియన్ చేరింది. ఆమె ఔట్ అయిన తర్వాత టీమిండియా వరుసగా వికెట్లు కోల్పోయింది. చివర్లో రిచా ఘోష్ 50 రన్స్ నాటౌట్‌తో భారత్ భారీ స్కోరు చేసింది. 341/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఇంగ్లాండ్ ముందు 457 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిపోయినప్పటికీ భారత్ తొలి రోజు నుంచే పూర్తిగా ఆధిపత్యం చలాయించింది. ఏ దశలోనూ ఇంగ్లాండ్ విజయం దిశగా సాగలేదు. తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (83 పరుగులు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (58 పరుగులు), దీప్తి శర్మ (57 పరుగులు) ముగ్గురూ హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారత్ పోరాడగలిగే 285 పరుగులు చేయగలిగింది. ఆ తర్వాత తొలి బౌలింగ్‌లోనూ అదే సత్తా చాటుతూ ప్రత్యర్థిని 170 రన్స్‌కే ఆలౌట్ చేసింది. టీమ్‌ఇండియా ప్లేయర్లు క్రాంతి గౌడ్, యస్తికా భాటియా తమతమ కెరీర్‌లో అరుదైన ఘనత సాధించారు. రెండో రోజు ఆటలో తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లతో సత్తా చాటి ఇంగ్లాండ్ పతనాన్ని శాసించిన క్రాంతి గౌడ్ తన పేరును లార్డ్స్ ఆనర్స్ బోర్డులో లిఖించుకుంది. దీంతో ఈ గౌరవం అందుకున్న తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సాధించింది. అంతకుముందు ఏ మహిళా ప్లేయర్‌కు కూడా ఈ గౌరవం దక్కలేదు. ఆ తర్వాత మూడో రోజు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ యస్తికా భాటియా శతకం బాదేసింది. వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన భాటియా 158 బంతులు ఎదుర్కొని 113 పరుగులు చేసింది. ఇందులో 14 ఫోర్లు ఉన్నాయి. దీంతో లార్డ్స్ మైదానంలో టెస్ట్ సెంచరీ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా యస్తికా భాటియా చరిత్ర సృష్టించింది. ఫలితంగా ఆమె పేరు కూడా అక్కడి ప్రఖ్యాత 'ఆనర్స్ బోర్డు'పై కెక్కింది. ఇది భారత క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయంగా చెప్పవచ్చు. అయితే భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీలాంటి బ్యాటర్లకు సైతం లార్డ్స్‌లో సెంచరీ సాధించడం సాధ్యం కాలేదు. అలాంటిది 26ఏళ్ల యస్తిక ఈ ఘనత అందుకుంది. ఇక లార్డ్స్‌లో శతకం బాదిన భారత 11వ క్రికెటర్‌గానూ నిలిచింది. వినూ మన్కడ్, దిలీప్ వెంగ్‌సర్కార్, గుండప్ప విశ్వనాథ్, రవిశాస్త్రి, మహ్మద్ అజారుద్దీన్, సౌరభ్ గంగూలీ, అజిత్ అగార్కర్, రాహుల్ ద్రవిడ్, కేఎల్ రాహుల్ అజింక్యా రహానే లార్డ్స్‌లో టెస్టు సెంచరీలు చేశారు. సంక్షిప్త స్కోర్లు: భారత్: తొలి ఇన్నింగ్స్ - 285/10 రెండో ఇన్నింగ్స్ - 347/7 (డిక్లేర్డ్) ఇంగ్లాండ్: తొలి ఇన్నింగ్స్ - 170/ 10 రెండో ఇన్నింగ్స్ - 186 / 10

# హెడ్ కోచ్ పదవికి మెక్‌కల్లమ్ రాజీనామా..!



ఇంగ్లాండ్ ప్రధాన కోచ్ పదవికి బ్రెండన్ మెక్‌కల్లమ్ రాజీనామా చేశాడు. ఇటీవల జట్టు చెత్త ప్రదర్శనతో విమర్శల పాలైన మెక్‌కల్లమ్ ఆదివారం (జులై 12, 2026) తాను కోచ్‌గా వైదొలుగుతున్నట్టు అధికారికంగా ప్రకటించాడు. 2022 నుంచి బెన్ స్టోక్స్‌తో కలిసి 'బజ్ బాల్' క్రికెట్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన అతడు.. తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నాడు. బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోజుల వ్యవధిలోనే మెక్ కల్లమ్ .. తప్పుకోవడం గమనార్హం. మెక్‌కల్లమ్ నిష్క్రమణ బాజ్ బాల్ శకానికి ముగింపు పలికినట్లయింది. మెక్‌కల్లమ్ 2022 నుంచి ఇంగ్లాండ్ టెస్ట్ కోచ్‌గా ఉన్నాడు. 2025లో వైట్-బాల్ జట్లకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. "టెస్ట్ జట్టుకు కోచింగ్ ఇవ్వడం అంటే నాకు చాలా ఇష్టం. మేం కలిసి సాధించిన వాటిపై గర్వపడుతున్నా. ఈ కాలంలో ఎన్నో నమ్మశక్యంకాని విజయాలు, అదే సమయంలో కఠిన ఫలితాలు చూశాం. కానీ ఇదంతా ఆటలో భాగమే. టెస్ట్ జట్టుకు హెడ్ కోచ్ పదవిని అదృష్టం, గౌరవంగా భావిస్తున్నా. నా ఈ ప్రయాణంలో మాకు మద్దతు ఇచ్చిన ఆటగాళ్లు, సిబ్బంది, అభిమానులకు కృతజ్ఞతలు. ఇప్పుడు నా దృష్టి వైట్ బాల్ జట్లకు కోచింగ్ ఇవ్వడంపై ఉంటుంది" అని మెక్ కల్లమ్ తన ప్రకటనలో పేర్కొన్నాడు. 2022లో ఇంగ్లాండ్ టెస్ట్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్.. అప్పటి కెప్టెన్ బెన్ స్టోక్స్‌తో కలిసి దూకుడైన ఆటకు శ్రీకారం చుట్టాడు. దీనికే 'బజ్‌బాల్' అని పేరొచ్చింది. ప్రారంభంలో బజ్ బాల్ మెరుగైన ఫలితాలు ఇచ్చింది. న్యూజిలాండ్ (3-0), దక్షిణాఫ్రికా (2-1)తో సిరీస్‌లు గెలుచుకుంది. పాకిస్థాన్‌పై 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. కానీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో మాత్రం ఇప్పటివరకు ఫైనల్ చేరలేకపోయింది. ఇంగ్లాండ్ 2021-23 సైకిల్‌లో నాలుగో స్థానంలో, 2023-25 సైకిల్‌లో ఐదో ప్లేసులో నిలిచింది. ప్రస్తుతం 2025-27 స్టాండింగ్స్‌లో ఏడవ స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ ఇటీవల టెస్టుల్లో పేలవ ఫలితాలు అందుకుంది. ఈ ఏడాది ప్రారంభంలో ఆస్ట్రేలియాలో ఇంగ్లాండ్ 4-1తో యాషెస్‌లో పరాజయం పాలైంది. గత నెలలో న్యూజిలాండ్ చేతిలో 2-1 తేడాతో స్వదేశంలో టెస్టు సిరీస్ ఓడిపోయింది.

# చెన్నై హెడ్ కోచ్ పదవికి ఫ్లెమింగ్ రాజీనామా..



## కొత్త కోచ్ రేసులో హేమంగ్ బదానీ, ద్రవిడ్

ఐపీఎల్ చరిత్రలోనే విజయవంతమైన కోచ్‌ల్లో ఒకరైన స్టీఫెన్ ఫ్లెమింగ్ చెన్నై సూపర్ కింగ్స్ తో తన అనుబంధాన్ని ముగించారు. ఏకంగా 18 ఏళ్లపాటు సీఎస్కేతో కలిసి పని చేసిన ఆయన చెన్నై హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. తాము, ఫ్లెమింగ్ ఉమ్మడిగా ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెన్నై సూపర్ కింగ్స్ సోమవారం ప్రకటించింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం సంధి దశలో ఉంది. సీఎస్కేకు క్రేజ్ తీసుకొచ్చిన ధోనీ కెరీర్ చరమాంకంలో ఉంది. దీంతో రుతురాజ్ గైక్వాడ్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. గత మూడు సీజన్లలో చెన్నై ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయింది. 2024, 2025, 2026 సీజన్లలో లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. చెన్నై సూపర్ కింగ్స్ సిస్టర్ ఫ్రాంచైజీ అయిన టెక్సాస్ సూపర్ కింగ్స్ సైతం ఈ ఏడాది మేజర్ లీగ్ క్రికెట్‌లో చివరి స్థానానికి పరిమితమైంది. ఈ జట్టు బాధ్యతలను కూడా ఫ్లెమింగ్ పర్యవేక్షించేవారు. ఫ్రాంచైజీకి చెందిన జట్లు వరుసగా విఫలం అవుతున్న నేపథ్యంలో ఫ్లెమింగ్‌తో అనుబంధాన్ని సూపర్ కింగ్స్ తెంచుకుందని భావిస్తున్నారు. ఐపీఎల్‌తోపాటు అమెరికా, సౌతాఫ్రికాల్లోని సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీల బాధ్యతల నుంచి కూడా ఫ్లెమింగ్ తప్పుకున్నారు. 2008లో ఐపీఎల్ తొలి సీజన్లో ఆటగాడిగా చెన్నై సూపర్ కింగ్స్‌తో అనుబంధాన్ని మొదలుపెట్టిన ఫ్లెమింగ్.. 2009 సీజన్లో హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. 2026 సీజన్ ముగిసే వరకు ఆయన సీఎస్కే ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 17 ఏళ్లకుపైగా చెన్నై హెడ్ కోచ్‌గా వ్యవహరించిన న్యూజిలాండ్ మాజీ కెప్టెన్.. బలమైన ఆధునిక క్రికెట్ సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఫ్లెమింగ్ మార్గదర్శకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదు ఐపీఎల్ టైటిల్స్ సాధించడంతోపాటు రెండు ఛాంపియన్స్ లీగ్ టైటిళ్లు గెలుపొందింది. 12సార్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన సీఎస్కే పదిసార్లు ఫైనల్‌కు చేరుకుంది. కోచ్ ఫ్లెమింగ్, కెప్టెన్ ధోనీ మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయి. వీరిద్దరికీ మేనేజ్‌మెంట్ పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో చెన్నై సూపర్ కింగ్స్ ఈ స్థాయిలో విజయాలు సాధించగలిగింది. ఫ్రాంచైజీ క్రికెట్లో ఆటగాళ్లు, సహాయక సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. కానీ ధోనీ, ఫ్లెమింగ్ కలిసి డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వీరిద్దరూ ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవిస్తూ.. తమ పరిధులను అర్థం చేసుకుంటూ.. ప్రశాంతంగా పని చేసుకొని పోయేవారు. ఒకరిపై మరొకరికి అపారమైన నమ్మకం ఉండేది. సీఎస్కే తరఫున ఆడిన చాలా మంది ఆటగాళు అక్కడి డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం గురించి ఇప్పటికీ గొప్పగా చెబుతుంటారు. "పద్దెనిమిదేళ్లు అనేది స్పోర్ట్స్‌లో లైఫ్ టైమ్, పూర్తి కృతజ్ఞతా భావంతో నేను వీడ్కోలు పలుకుతున్నా. సీఎస్కేతో నేను గడిపిన కాలం నా కోచింగ్ కెరీర్లోనే ఎంతో గొప్పది. మనం సాధించిన ప్రతి దానికీ నేను గర్విస్తున్నాను. మనం ఎన్నో మర్చిపోలేని విజయాలను ఆస్వాదించాం, ఎన్నో క్లిష్ట పరిస్థితులను అధిగమించాం. జీవితాంతం నాతో నిలిచిపోయే జ్ఞాపకాలను సంపాదించుకున్నాను" అని చెన్నై హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్న సందర్భంగా స్టీఫెన్ ఫ్లెమింగ్ వ్యాఖ్యానించారు. ఫ్లెమింగ్ హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్న వేళ సీఎస్కే ఫ్రాంచైజీ యజమాని రూపా గురునాథ్, మేనేజింగ్ డైరెక్టర్ కాశీ విశ్వనాథ్ ఆయనపై ప్రశంసలు గుప్పించారు. ఎలా ఆడాం అనేదే కాకుండా ఓ ఫ్రాంచైజీగా ఎలాంటి స్థానానికి చేరుకోవాలనుకున్నామో నిర్దేశించడంలో ఫ్లెమింగ్ ఎంతో తోడ్పాటును అందించారని కాశీ విశ్వనాథ్ తెలిపారు. నిలకడ, అణకువ, జట్టు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వడం అనే విలువలపై ఆధారపడిన ఓ గొప్ప సంస్కృతిని ఫ్లెమింగ్ నిర్మించారంటూ సీఎస్కే ఎండీ కొనియాడారు.

# మళ్లీ బిజీగా మారిన నటి లయ

## వదలను సినిమా 17న విడుదల

అందాల నటి లయ 'భద్రం కొడుకో' చిత్రంతో బాలనటిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 'స్వయంవరం'తో హీరోయిన్ గా ఎదిగింది. ఫస్ట్ ఇన్నింగ్స్ లో పలు అర్థవంతమైన చిత్రాలలో నటించిన లయ... ఉత్తమ నటిగా నంది అవార్డులు అందుకుంది. అయితే ఆ తర్వాత వివాహానంతరం అమెరికాకు వెళ్ళిపోవడంతో కొన్నేళ్ళు నటనకు దూరంగా ఉంది. ఆ మధ్య రవితేజ 'అమర్ అక్బర్ ఆంథోని' మూవీలో తన కూతురుతో కలిసి మెరుపులా మెరిసన లయ... గత యేడాది 'తమ్ముడు' సినిమాతో రీ–ఎంట్రీ ఇచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఆ సినిమా లయ అక్కగా నటించింది. కానీ ఆ సినిమా నిరాశ పర్చింది. ఆ తర్వాత తనకు బాగా కలిసి వచ్చిన శివాజీ సరసన లయ 'సంప్రదాయని సుప్పిని సుద్దపూసని' చిత్రంలో నాయికగా నటించింది. కానీ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేదు. గతంలో జగపతిబాబు సరసన 'మనోహరం'లో నటించి మంచి పేరు తెచ్చుకున్న లయ ఇప్పుడు మరోసారి ఆయనతోనే 'వదలా' చిత్రంలో చేస్తోంది. హృతికా శ్రీనివాస్ కీలక పాత్ర పోషించిన 'వదలా' హారర్ నేపథ్యంలో తెరకెక్కిన ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాను ఆకెళ్ళ వి కృష్ణ తెరకెక్కించాడు. మూడు వారాల క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమాకు మరింత మెరుగులద్ది జూలై 17న విడుదల చేస్తున్నట్టు జగపతి బాబు తెలిపారు. విశేషం ఏమంటే... గతంలో శ్రీకాంత్ సరసన పలు చిత్రాలలో నటించిన లయ ఇప్పుడు 'మిస్టర్ మిడిల్ క్లాస్'మూవీలో హీరోయిన్ గా నటించింది. ఇందులో రాజేంద్ర ప్రసాద్ వేంకటేశ్వర స్వామిగా నటిస్తున్నారు. ఈ సోషియో ఫాంటసీ మూవీని జి. నాగేశ్వరరెడ్డి డైరెక్ట్ చేశారు. ఈ సినిమా కూడా జూలై 17నే రాబోతోంది. ఇలా సెకండ్ ఇన్నింగ్స్‌లో లయ హీరోయిన్ గా నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం కాకతాళీయం.ఇదే విషయాన్ని 'వదలా' చిత్ర నిర్మాతల్లో ఒకరైన తమ్మారెడ్డి భరద్వాజ దగ్గర ప్రస్తావించినప్పుడు ఆయన చాలా స్పోర్టివ్‌గా ఈ అంశాన్ని తీసుకున్నారు. 'ప్రతి వారం ఐదారు సినిమాలు వస్తూనే ఉంటాయి. అందులో బాగున్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తూ ఉంటారు. లయ నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం తప్పేమీ కాదు. నిర్మాతలం ఎవరి వీలును బట్టి వాళ్ళం సినిమాలు రిలీజ్ చేస్తుంటాం. ఏ సినిమా బాగుంటే అది ఆడుతుంది... అంతే!' అని అన్నారు. ఈ వీకెండ్‌లో ఎనిమిది చిత్రాలు విడుదల అవుతుండగా, అందులో లయవి రెండు సినిమాలు. మరి వీటిల్లో ఏయే సినిమాలు ప్రేక్షకాదరణ పొందుతాయో చూడాలి.



## 24న సందడి చేయనున్న 'జన నాయగన్'

### ఓవర్సీస్‌లో అన్‌కట్ వర్షన్ విడుదల



ఏడు నెలల నిరీక్షణకు చెక్ పెడుతూ.. 'జన నాయగన్' జులై 24న సందడి చేయనుంది. విజయ్ కథానాయకుడిగా తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. బోర్డు చెప్పిన మార్పులను చేసి చిత్రబృందం దీన్ని విడుదల చేసేందుకు సిద్ధమైంది. అయితే ఓవర్సీస్‌లో మాత్రం ఈ సినిమా అన్‌కట్ వెర్షన్ విడుదల కానుంది. భారత్‌లో పలు కట్స్ విధించినప్పటికీ, యూకే లో మాత్రం ఈ చిత్రం ఎలాంటి కట్స్ లేకుండా ప్రేక్షకుల ముందుకు రానుంది. అక్కడ ఈ సినిమాను ఎలాంటి మార్పుల్లేకుండానే విడుదల చేసేందుకు అనుమతి లభించింది. ఇక విజయ్ ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి కావడంతో సినిమా టైటిల్ కార్డులోనూ మార్పు చేశారు. గతంలో దళపతి విజయ్ అనే టైటిల్ కార్డు.. ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌గా మారనుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు 12 మార్పులు సూచించి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను తొలగించడంతో పాటు కొన్ని పదాలను మ్యూట్ చేయాలని.. మరికొన్ని సన్నివేశాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. విడుదల నేపథ్యంలో త్వరలోనే

## ధనుష్ సినిమాలో విజయ్ సేతుపతి?..


జాతీయ అవార్డు గ్రహీతలు, నటుడు ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'తమిళ్ మురుగన్'. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. అయితే, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ఈ ఫస్ట్ లుక్‌ను తన సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో కోలీవుడ్‌లో సరికొత్త చర్చ మొదలైంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి కూడా ఒక కీలక పాత్ర పోషిస్తున్నారంటూ ఊహాగానాలు జోరందుకున్నాయి.వండర్‌వాల్ ఫిలింస్, ప్రొడక్షన్ మైల్స్ టు గో సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. విజయ్ సేతుపతి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను షేర్ చేయడంతో, ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని అభిమానులు అంచనా వేస్తున్నారు. గతంలో వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన 'విడుదలై', 'అరసన్' వంటి చిత్రాల్లో విజయ్ సేతుపతి నటించారు. ఈ నేపథ్యంలో తాజా ప్రచారానికి మరింత బలం చేకూరింది.ధనుష్, వెట్రిమారన్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా ఘనవిజయం సాధించాయి. ఇప్పుడు ఈ శక్తివంతమైన కలయికకు విజయ్ సేతుపతి కూడా తోడైతే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, విజయ్ సేతుపతి నటిస్తున్నట్లు చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తదుపరి నటీనటుల వివరాలు, సినిమా విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత రావాల్సి ఉంది.





## ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంపై పుకార్లు

### అలాంటిదేమీ లేదంటూ టీమ్ వెల్లడి



జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా జూలై 18న తారక్ కీలక ప్రకటన చేయనున్నారని, అభిమాన సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించ నున్నారనే వార్తలు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారం సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారడంతో తాజాగా ఎన్టీఆర్ టీమ్ అధికారికంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చింది. ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి విజయాన్ని అందుకున్న నేపథ్యంలో, అదే తరహాలో జూనియర్ ఎన్టీఆర్ కూడా రాజకీయాల్లోకి రాబోతున్నారనే ఊహాగానాలు మరింత బలపడ్డాయి. గతంలో 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించడం, అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం కావడం వంటి పరిణామాలను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ వార్తలన్నింటికీ ఎన్టీఆర్ టీమ్ ఆదివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనతో చెక్ పడింది. టీమ్ విడుదల చేసిన ప్రకటనలో, జూలై 18న రాజకీయ ప్రకటన ఉంటుందంటూ ప్రచారంలో ఉన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ఆ రోజు నిర్వహించబోయే కార్యక్రమం 'ఊరు వాడ' పేరుతో ఇప్పటికే ముందుగానే ప్రణాళికాబద్ధంగా రూపొందించిన ఒక సామాజిక కార్యక్రమమని వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా 'ఊరు వాడ' కార్యక్రమం లక్ష్యం, ఉద్దేశ్యం, విజన్‌ను ప్రజలకు పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. దీనికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా తెలిపింది. 'ఊరు వాడ' కార్యక్రమానికి సంబంధించిన వేదిక, సమయం, పూర్తి కార్యాచరణ వివరాలను త్వరలోనే జూనియర్ ఎన్టీఆర్ అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా వెల్లడిస్తామని టీమ్ పేర్కొంది. అలాగే మీడియా సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, సోషల్ మీడియా ఖాతాలు ధృవీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేసింది. ఎలాంటి వార్తనైనా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే ప్రచురించాలని కోరుతూ, తప్పుడు ప్రచారం వల్ల అభిమానుల్లో అనవసర గందరగోళం ఏర్పడుతుందని తెలిపింది.

## మహేశ్‌బాబు కుటుంబంలో పెళ్లి సందడి

### కొరియన్ అమ్మాయితో సిద్దార్థ్ గల్లా నిశ్చితార్థం



సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు సిద్దార్థ్ గల్లా త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. కొరియాకు చెందిన యువతి హాయిన్ (జిన్నీ)తో ప్రేమలో ఉన్న సిద్దార్థ్, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం ఘనంగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఈ శుభకార్యానికి మహేష్ బాబు కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు హాజరై సందడి చేశారు. మహేష్ బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఎంగేజ్‌మెంట్ వేడుకకు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను షేర్ చేస్తూ కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఈ ఫొటోలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫొటోల్లో నమ్రతతో పాటు మహేష్ బాబు సోదరీమణులు, కుటుంబ సభ్యులు కనిపించారు. ముఖ్యంగా మహేష్ అన్న దివంగత రమేష్ బాబు కుమార్తె భారతి కూడా ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చాలా అరుదుగా పబ్లిక్‌లో కనిపించే భారతి ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో అభిమానులు ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. సిద్దార్థ్ గల్లా ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకుడు గల్లా జయదేవ్ మరియు పద్మావతి దంపతుల చిన్న కుమారుడు. ఆయన అన్న అశోక్ గల్లా ఇప్పటికే హీరోగా టాలీవుడ్‌లో అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం అశోక్ గల్లా నటిస్తున్న 'వీసా' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇక సిద్దార్థ్ గల్లా మాత్రం సినీ రంగానికి దూరంగా ఉండి కుటుంబ వ్యాపార వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా కొరియన్ యువతి హాయిన్‌తో ప్రేమలో ఉన్న ఆయన, ఇప్పుడు కుటుంబ సభ్యుల అంగీకారంతో కొత్త జీవితానికి శ్రీకారం చుట్టబోతున్నారు.

## వరుణ్ 'కొరియన్ కనకరాజు' టీజర్..

### రాయలసీమ టు కొరియా హారర్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ కొరియన్ కనకరాజు టీజర్ విడుదలైన తర్వాత సినిమాపై హైప్ మరింత పెరిగింది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఆ హారర్ కామెడీ మూవీలో ఎంటర్టైన్మెంట్, థ్రిల్, యాక్షన్ ను కొత్త తరహాలో చూపించే ప్రయత్నం చేసినట్లు టీజర్ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. ముఖ్యంగా రాయలసీమ నుంచి కొరియా వరకు సాగే స్టోరీ లైన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. టీజర్ ప్రారంభం నుంచే కొత్తదనాన్ని చూపించే ప్రయత్నం కనిపిస్తుంది. ఒకవైపు సాధారణ రాయలసీమ యువకుడిలా కనిపించే కనకరాజు.. మరోవైపు స్టైలిష్ కొరియన్ మాఫియా బాస్ గా వరుణ్ తేజ్ కనిపించడం కథపై క్యూరియాసిటీని పెంచుతోంది. ఆ రెండు భిన్నమైన షేడ్స్ ను ఎలా కలిపారన్న అంశాన్ని మాత్రం మేకర్స్ పూర్తిగా బయటపెట్టకుండా సస్పెన్స్ కంటిన్యూ చేశారు.వరుణ్ తేజ్ లుక్ టీజర్ లో మెయిన్ అట్రాక్షన్ గా నిలిచింది. రాయలసీమ యువకుడి పాత్రలో చాలా న్యాచురల్ గా కనిపించడంతో పాటు, కొరియన్ అవతార్ లో స్టైలిష్ గా, ఇంటెన్స్ గా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. రెండు విభిన్న పాత్రల్లో కూడా ఆయన చూపించిన బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాపై అంచనాలను పెంచేలా ఉన్నాయి. టీజర్ లో మరో స్పెషాలిటీ కామెడీ. ముఖ్యంగా వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే సన్నివేశాలు ఫుల్ గా ఎంటర్టైన్మెంట్ ను పంచేలా కనిపిస్తున్నాయి. హారర్ కామెడీకి అవసరమైన ఫన్నీ ఎలిమెంట్స్ ను దర్శకుడు ఈక్వల్ గా మిక్స్ చేసినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. భయం, నవ్వు రెండింటినీ ఒకేసారి అందించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. టెక్నికల్ గా కూడా టీజర్ మంచి రెస్పాన్స్ సంపాదిస్తోంది. కొరియా లొకేషన్లను చూపించిన తీరు, ప్రతి ఫ్రేమ్ ను గ్రాండ్ గా చూపించిన సినిమాటోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

విజువల్స్ కు తగ్గట్టుగా సంగీత దర్శకుడు ఎస్. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్ కు మరింత బలం చేకూర్చింది. కొన్ని సన్నివేశాల్లో బీజీఎం థ్రిల్ ను పెంచగా, మరికొన్ని చోట్ల ఎంటర్టైన్మెంట్ కు తగ్గట్టుగా సాగింది. హీరోయిన్ గా రితికా నాయక్ నటిస్తున్న ఆ చిత్రాన్ని ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్, యూవీ క్రియేషన్స్, టీ–సిరీస్ సౌత్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రొడక్షన్ వాల్యూస్ టీజర్ లో క్లియర్ గా కనిపిస్తున్నాయి. విజువల్ క్వాలిటీ, మేకింగ్ స్టాండర్డ్ సినిమాపై మరింత నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. ఇప్పుడు కొరియన్ కనకరాజు మూవీ టీజర్ కేవలం కథను పరిచయం చేయడానికే పరిమితం కాకుండా, సినిమాలో ఉండబోయే ఎంటర్టైన్మెంట్ కు చిన్న ఉదాహరణగా చూపించినట్లు అనిపిస్తోంది. ఇండో– కొరియన్ బ్యాక్ డ్రాప్, వరుణ్ తేజ్ డ్యూయల్ షేడ్స్, హారర్ కామెడీ టచ్, స్టైలిష్ విజువల్స్ కలిసి ఆ చిత్రాన్ని ఆసక్తికరంగా మార్చాయి. టీజర్ కు వస్తున్న పాజిటివ్ రెస్పాన్స్ తో ఆగస్టు 7న విడుదల కానున్న ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రిజల్ట్ ను అందుకుంటుందన్న ఆసక్తి ఇప్పుడు సినీ ప్రియుల్లో నెలకొంది.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569